నవతెలంగాణ

1

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం 28 ఏప్రిల్ 2023

రేషన్ బియ్యం వద్దని ఇండ్లకు వెళ్లిన మహిళలు





నవతెలంగాణ కౌడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం పురుగులు, తుట్టేలు కట్టినవి, నల్లమట్టితో కూడుకున్నవి పంపిణీ చేయడంతో అనారోగ్యాలకు గురవుతున్నామని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం రాజిపేటలో మహిళలు రేషన్ షాప్ వద్దకు వెళ్లి బియ్యం వద్దని, మంచి బియ్యం పంపిణీ చేస్తేనే తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ... బియ్యం తీసుకోకుండానే ఇండ్లకు వెళ్లిపోయారు. ఇచ్చే ఆరు కిలోల బియ్యం మంచివి ఇవ్వకుండా... ప్రాణాలకు హాని కలిగించే బియ్యం తింటే హాస్పిటల్ ఖర్చులు పెట్టుకునే స్థోమత తమకు లేదని మహిళలు ఆరోపించారు. మంచి బియ్యం పంపిణీ చేస్తే తీసుకుంటామని లేదంటే రేషన్ బియ్యం ఇవ్వొద్దని రేషన్ డీలర్‌కు మహిళలు విన్నవించారు. రేషన్ బియ్యంలో వచ్చే దుమ్ము గొంతు ముక్కులోకి పోయి ఊపిరితిత్తులు పాడైతున్నాయని మహిళలు ఆరోపించారు. నాలుగు రోజులు మాత్రమే పంపిణీ చేసి.. బియ్యం ఉన్నా పంపిణీ చేయకుండా టైం అయిపోయిందని డీలర్ చెప్పడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బియ్యం తినే కంటే పురుగుల మందు తాగింది మంచిదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలోనే వేచి చూసి ఇండ్లకు వెళ్లిపోయారు. ఈ విషయమై రేషన్ డీలర్‌ను వివరణ కోరగా ప్రభుత్వం ఇచ్చిన బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మూడు నెలలుగా ఇలాంటి బియ్యమే వస్తోందన్నారు. అధికారులకు చెప్పినా ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యం మాత్రమే ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు.

మనువాదం మానవాళికి ప్రమాదం





- మోడీ పాలనలో మానసిక చట్టాలుగా మనువాదం అమలు
- రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు ఆర్ఎస్ఎస్ కుట్ర
- ప్రభుత్వ రంగం ధ్వంసమైతే రిజర్వేషన్లు మాయం
- ఆట.. పాట.. మాటగా సాగిన పూలే, అంబేద్కర్ జనజాతర

'మనిషిని మనిషిగ చూడని మనువాదరం మానవ సమాజానికి పెను ప్రమాదం. మోడీ పాలనలో అది మానసిక చట్టాలుగా అమలవుతుంది. రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని ఆధునిక రాజ్యాంగంగా తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తోంది. ప్రభుత్వ రంగం ధ్వంసమైతే రిజర్వేషన్ల ఉనికే మాయమవుతుంది. మూల వాసుల్ని చదువు, సంపద, అధికారానికి దూరం చేసిన మను శాస్త్రం ప్రమాదాన్ని అర్థం చేసుకోకపోతే మన ఉనికే ప్రమాదమవుతుంది. మనువాదాన్ని ప్రతిఘటిద్దాం.. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం. అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు మాత్రమే సంఘ్ పరివార్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడగలరు. సైదాంతిక పోరాటం చేయగలరు' ఇదీ.. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన పూలే. అంబేద్కర్ జన జాతరలో ఆట, పాట, మాట ద్వారా వ్యక్తలిచ్చిన సందేశం.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కేవీపీఎస్, సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో పూలే, అంబేద్కర్ జనజాతర నిర్వహించారు. ఐబీ నుంచి పాత బస్టాండ్ వరకు నీలి దండు కవాతు నిర్వహించారు. డప్పుల దర్వులు, నృత్యాలతో ఆడుతూ పాడుతూ ర్యాలీ సాగింది. వందలాది మంది కేవీపీఎస్, సామాజిక, ప్రజా సంఘాలు, దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన జన జాతర సభకు ముఖ్య అతిదిలుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొపెసర్ చింతకింది కాశీం, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. స్కైలాబ్‌బాబు, బహుజన వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్, ఉద్యమ గాయని స్వర్ణక్క, డిక్కీ సౌత్ ఇండియా ఉపాధ్యక్షులు చంటి రాహుల్‌కిరణ్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ పాల్గొని ప్రసంగించారు. ఆటా-పాటా-మాటాగా సాగిన జన జాతర సామాజిక శ్రేణుల్ని ఉత్సాహపర్చింది. అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు పెద్ద ఎత్తున సభకు తరలి వచ్చారు. అర్ధరాత్రి వరకు జరిగిన జన జాతరలో డప్పుల దర్వులతో సభాప్రాంగణమంతా మారుమ్రోగింది. వ్యక్తల ఉపన్యాసాలు సభికుల్ని ఆలోచింపజేశాయి. మనువాద ప్రమాదాన్ని విప్పి చెప్పిన తీరు అద్భుతంగా సాగింది. కాశీం ప్రసంగంలో జ్యోతిరావుపూలె సామాజిక చైతన్యం పొందిన తీరును వివరించారు. బాల్యంలోనే అసమానతలకు కారణమైన మనుశాస్త్రంను తప్పుపట్టి సామాజిక న్యాయం కోసం చదువు ప్రాధాన్యతను నొక్కి చెప్పిన పద్ధతి ఆకట్టుకుంది. ఆ తర్వాత అంబేద్కర్ తన జీవితాంతం సాగించిన పోరాట ఘటాలను విప్పి చెప్పారు. సంఘ్ పరివార్ శక్తుల్ని అడ్డుకునే దమ్ము ఒక్క కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులకు మాత్రమే ఉందన్నారు. బహుజన వాగ్గేయకారుడు మచ్చ దేవేందర్ సమాజ పరిణామక్రమంలో స్త్రీ ఔదార్యాన్ని, త్యాగ నిరతిని, దౌర్యసాహసాలను 'వినవయ్య ఓ పురుషుడా ఆడది అబలెట్ల అవుతుందిరా' అంటూ పాట రూపంలో ప్రశ్నించిన తీరు సామాజిక శ్రేణుల మస్తిస్కాన్ని ఉత్తేజ పరిచింది. 'వినుడి వినుడి దేవుళ్ల కథ...అలనాడు జరిగే ఓ వింత కథ..!' అంటూ పుక్కిటి పురాణాల లోగుట్టును నిలదీసిండు. 'తెలియకనే నేనడుగుతున్నాను...తెలిసిన వాళ్లు తెలియ చెప్పండ్రు తెలివి ఉంటే' అంటూ మనువాదుల్ని దులుమాడిన దేవేందర్ పాటా-మాటాలు తూటాల్లా పేలాయి. ఉద్యమ గాయని స్వర్ణక్క అందుకో దండాలు బాబా అంబేద్కరా అనే పాట మొదలు మహనీయులందర్నీ స్మరిస్తూ పాడిన పాటలు సభికుల్ని ఉత్తేజ పరిచాయి. డప్పు సంకనేసుకుని దర్వేస్తూ లేగదూడ వలే గంతులేస్తూ పాటా-మాటా-ఆటా కలగలిపి ధూంధాం చేసింది. కాశీం, స్కైలాబ్‌బాబు, దేవేందర్, స్వర్ణక్క, మాణిక్‌లు డబ్బుల దర్వుల స్టెప్పులేయడంతో సభంతా జాతరగా మారింది. జాతరలో పాల్గొన్న వాళ్లల్లో పూలె అంబేద్కర్ ఆశయాల పట్ల వారికున్న అంకిత భావం ప్రస్ఫుటమైంది. ఈ కార్యక్రమంలో సీపీఐఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి నాగభూషణం, సామాజిక, ప్రజా సంఘాల నాయకులు నాగయ్య, దర్శన్ రామారావు, నర్సింహులు, యాదగిరి, సురేష్‌నాయక్, శివరాజు, సుభాష్, దాసు, ప్రవీణ్, అంజనేయులు, మల్లేశ్, రమేష్, మహేష్, రాజయ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మనువాదానికి రాజ్యాంగానికి అంతర్యుద్ధం

మనువాదం, భారత రాజ్యాంగం మధ్య ఒక అంతర్యుద్ధం కొనసాగుతుందన్నారు. మనువాదం మనుషుల్ని ముక్కలు ముక్కలు చేస్తే రాజ్యాంగం మనుషులందరూ సమానం అని చాటి చెప్పిందని పేర్కొన్నారు. దేశంలో అన్ని రకాల అసమానతలకు మనువాదం మూల కారణమైతే రాజ్యాంగంలో మాత్రం మొదటి పేజీలోనే చట్టం ముందు అందరూ సమానులే అని పేర్కొనబడిందన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళలను మనువాదం ఏనాడు కూడా మనుషులుగా చూడలేదన్నారు. బీఆర్ అంబేద్కర్ మాత్రం మహిళల హక్కుల కోసం హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెడితే మనువాద భావజాలమున్న వ్యక్తులు దాన్ని వ్యతిరేకిండంతో మంత్రి పదవికి రాజీనామా పార్టీ నుంచి బయటికి వచ్చారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను రక్షించడం కోసం అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు.



– ప్రొపెసర్ కాశీం

రాజ్యాంగం రద్దుకు కుట్ర



బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి దోహదం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను అమ్మడం ద్వారా బీజేపీ కేంద్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లను సమాధి చేస్తుందని విమర్శించారు. బీజేపీ ప్రధాని అని గప్పెలు కొట్టిన బీజేపీ నేతలు ఎందుకు బీసీ కుల గణన చేయడంలేదని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మహిళలపై 300 రెట్లు దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు పెరిగాయని గుర్తు చేశారు. మనువాదం ఎజెండాతో పనిచేస్తున్న బీజేపీ ప్రభుత్వం మరో పక్క కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు రాజకీయాలకు అతీతంగా ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 29న హైదరాబాద్‌లో జరిగే పూలె అంబేద్కర్ జన జాతర ముగింపు సభకు ప్రజలు తరలిరావాలని కోరారు.

– టీ. స్కైలాబ్‌బాబు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

భార్యను కాపురానికి పంపట్లేదని

అత్తామామను హతమార్చడానికి అల్లుడి కుట్ర



నవతెలంగాణ-నారాయణఖేడ్

వారం రోజుల క్రితం సంజీవనరావుపేటలో జరిగిన కరెంటు షాక్ ఘటనలో.. అత్తామామలను హతమార్చడానికి అల్లుడే కుట్ర పన్నినట్టు పోలీసులు తెలిపారు. ఖేడ్ ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ మండలంలోని సంజీవనరా వుపేట గ్రామానికి చెందిన రాములు, రామవ్వ దంపతులు తమ కూతురిని పిట్ల మండలం గౌరారం గ్రామానికి చెందిన గొల్ల రమేష్‌కు ఇచ్చి కొన్నేండ్ల క్రితం వివాహం చేశారు. అయితే కుటుం కలహాలతో రెండేండ్లుగా పుట్టింటి దగ్గరే రమేష్ భార్య ఉంటున్నది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన రమేష్.. ఈనెల 12న రాత్రి సమయంలో రాములు ఇంటికి వచ్చి పిలువగా ఎవరూ పలకలేదు. దీంతో కోపోద్రిక్తుడైన అతడు.. ఎలాగైనా వారిని హతమార్చాలని కుట్ర పన్నాడు. ఈ క్రమంలోనే అర్ధరాత్రి సమయంలో అక్కడ దొరికిన ఓ సెంట్రింగ్ వైరును తీసుకుని మీటర్‌లో కనెక్షన్ ఇచ్చి డోర్ ద్వారా ఓ రాడ్డుకు కట్టాడు. అనంతరం అక్కడినుంచి రాములు పొలం దగ్గరికి వెళ్లి బోర్ మోటార్‌లో రాళ్లు వేసి ధ్వంసం చేశాడు. అయితే ఈ విషయం తెలియని రాములు డోర్‌ను తీసే క్రమంలో విద్యుద్ఘాతానికి గురై గాయాలతో బయటపడ్డాడు. అనంతరం ఈ విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారం రోజుల్లోనే కేసును ఛేదించారు. నిందితుడు రమేష్‌ను బుధవారం రోజు అరెస్టు చేసి జైలుకు పంపినట్టు పోలీసులు తెలిపారు.

మేడే స్ఫూర్తితోనే పోరాటాలతోనే వరుస విజయాలు



నవ తెలంగాణ-గజ్వేల్

పోరాటాలతోనే వరుస విజయాలు సాధిస్తుందని, దీనికి స్ఫూర్తి మే డే అని రానే బ్రేక్ లైన్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ అన్నారు. రానే బ్రేక్ లైనింగ్ పరిశ్రమలో వరుసగా బీఎంఎస్‌పై సీఐటీయూ మూడుసార్లు విజయం సాధించడం జరిగిందని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ సహకారంతో మంచి వేతన ఒప్పందం జరిగిందన్నారు. ఆరోగ్య సంక్షేమ పథకాలు ప్రమాద బీమా సౌకర్యాలు పరిశ్రమలో కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు అమలు జరిగే విధంగా సీఐటీయూ కృషి చేసిందన్నారు. పరిశ్రమలో ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగినా మొత్తం వేతనంతో పాటు ప్రమాద ఖర్చులు పరిశ్రమ యజమాన్యం భరిస్తుందన్నారు. ప్రమాదం జరిగే కార్మికుడు పరిశ్రమలో చనిపోయిన బీమా రూ.15 లక్షలు వస్తుందన్నారు. ప్రతి సంవత్సరం ఇయర్లీ గిఫ్ట్ సర్వీస్‌ని బట్టి డబ్బులు వస్తాయన్నారు.

అంతా మా ఇష్టం మమ్మల్ని అడిగేదెవరు?





నవ తెలంగాణ - దౌల్తాబాద్

మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో గల బ్రాంచ్ పోస్ట్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ రోజు 9.30 గంటలకు తెరవాల్సిన కార్యాలయం గురువారం ఉదయం 11 గంటలకు కూడా సిబ్బంది రాకపోవడంతో పెన్షన్ల కోసం వచ్చిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెన్షన్ల కోసం పొద్దున 9 గంటలకు వచ్చినా ఇప్పటిదాకా ఎవరు రాలే... ఎండకు ఇబ్బంది అయ్యి చెట్టు కింద కూర్చున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఏసీబీ వలలో ఆర్ఐ





నవతెలంగాణ ములుగు

మండల పరిధిలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన అవుసలి అంజనేయులుకు ఒక ఎకరం 14 గుంటల అసైన్డ్ భూమి ఉంది. ఇటీవల అవుసలి అంజనేయులు మరణించారు. ఆయన కూతురు గిరిజవాణి పేరు మీద ఒక ఎకరం 14 గుంటల భూమిని పౌతీ మార్పిడి కోసం 2022 నవంబర్‌లో దరఖాస్తు చేశారు. విచారణ చేసి రిపోర్టు ఇవ్వాలని ఆర్ఐ జావిద్‌పాషాను ములుగు ఎమ్మార్వో ఆదేశించారు. ఆ భూమిని గిరిజవాణి పేరు మీద మార్పిడి చేయడానికి రూ.ఒక లక్ష ఇవ్వాలని ఆర్ఐ డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇచ్చుకోలేమని గిరిజవాణి కుమారుడు అఖిల్ ఆర్ఐకి వివరించాడు. అనంతరం రూ.50 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వెంటనే అంత డబ్బు ఇచ్చుకోలేనని అఖిల్ మెదక్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. దీంతో ఏసీబీ అధికారులు వలపన్ని గురువారం సాయంత్రం 5.30 గంటలకు గౌరవరంలోని గ్రీన్ అరోమా రెస్టారెంట్‌కు రావాలని అఖిల్ చేత ఆర్ఐకి ఫోన్ చేయించారు. వెంటనే ఆర్ఐ జావిద్ పాషా డబ్బులు తీసుకోవడానికి అరోమా రెస్టారెంట్ వద్దకు వచ్చారు. అక్కడ కారులో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా ఆర్ఐని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మెదక్ డీఎస్పీ ఆనంద్ కుమార్, ఇన్స్పెక్టర్లు కే రమేష్, వెంకట్, రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.



సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యం: కలెక్టర్



నవతెలంగాణ మెదక్ రూరల్

సంకల్పం ఉంటే ఏదైనా సాధించొచ్చని కఠోర దీక్షతో దివి నుండి భువికి గంగను రప్పించి నిరూపించిన మహనీయుడు భగీరథ మహర్షి అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ నాయకులతో కలిసి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన గావించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భగీరథుడు చేసిన ప్రయత్నాలతోనే మనమీనాడు పవిత్ర గంగాజలంతో పునీతులమవుతున్నామని అన్నారు. గంగను భువికి తీసుకురాకుంటే మన పరిస్థితి ఏ విధంగా ఉండేదోనని, గంగను తీసుకురావడం ద్వారా చక్కటి పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. మూడో ప్రపంచ యుద్ధమే వస్తే అది నీటి సమస్య గురించే ఉంటుందన్నారు. మన రాష్ట్రంలో మిషన్ కాకతీయ ద్వారా భూగర్భ జలమట్టాలు పెరిగాయని, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి మంచి నీటిని అందిస్తున్నామన్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులుండే అవకాశాలున్నాయని, ప్రతి ఒక్కరికి నీటిని సమానంగా అందించాలంటే పొదుపుగా వాడడం అలవాటు చేసుకోవాలన్నారు. విషయంపై ప్రజలలో చర్చ సంఘాలలో, పిల్లలలో చైతన్యం తీసుకురావాలన్నారు. విజ్ఞానం సముపార్జించినవాడు ఏదైనా సాధించొచ్చని, ఇందుకు చదువు ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి గురుకులాలు, పాఠశాలలు, వసతి గృహ సౌకర్యం కల్పిస్తూ ఉచిత విద్య అందిస్తున్నదన్నారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనబరచి బాగా చదివి దేశం గర్వపడే విధంగా డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భగీరథుని అకుంఠిత దీక్ష, పట్టుదలను మార్గదర్శకంగా తీసుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సగర రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దత్తు సాగర్, జిల్లా అధ్యక్షులు సాయి కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ సాగర్, బి.సి. సంఘం అధ్యక్షులు మెట్టు గంగారాం, రవీందర్ సాగర్, సాయిలు, మునిసిపల్ కమీషనర్ జానకి రామ్ సాగర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ, సహాయ బి.సి.అభివృద్ధి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ అధికారుల జాడ ఎక్కడ?



నవతెలంగాణ-మద్దూరు: నాలుగు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వర్షానికి మామిడి తోటలు పూర్తిగా ధ్వంసమై మామిడికాయలు నేలరాయి. మామిడి పంట నష్టాన్ని సర్వే చేయాల్సిన హార్టికల్చర్ అధికారులు ఇప్పటివరకు మామిడి తోటలను సందర్శించిన పాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన మామిడి పంట వడగండ్ల వానతో నేలరాలి రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే హార్టికల్చర్ అధికారులు నిమ్మకు నేరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్దూరు దూల్మిట్ట మండలాల్లోని అన్ని గ్రామాలలో వడగండ్ల వర్షానికి మామిడి తోటలు పూర్తిగా ధ్వంసమై చెట్లకు ఉన్న మామిడి కాయలన్నీ నేలరాలిన పంట సర్వే చేసేందుకు అధికారులు ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, జిల్లా హార్టికల్చర్ అధికారులు వెంటనే స్పందించి మద్దూరు దూల్మిట్ట మండలాల్లోని అన్ని గ్రామాలలో మామిడి పంటలను సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి అందించాలని, మామిడి పంట నష్టపరిహారం అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జహీరాబాద్‌లో భారీ వర్షం

- నేలకొరిగిన చెట్లు
- మురుగునీటిలో మునిగిపోయిన వాహనాలు
- కొట్టుకుపోయిన గురువారం సంత







నవతెలంగాణ జహీరాబాద్

గురువారం కురిసిన అకాల వర్షానికి జహీరాబాద్ ప్రజలు అతలాకుతలమయ్యారు. సాయంత్రం పూట ఒకేసారి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురవడంతో రోడ్డుపై ప్రయాణికులు, ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఆర్టీసీ ప్రాంగణంలో చె ట్లు పడిపో వడంతో.. కార్యాలయంలోకి వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. దీంతో పాటు వడగండ్లవాన కురవడంతో వాహనదారులు ఎక్కడికక్కడ తమ వాహనాలను నిలిపి.. భవనాల కింద తలదాచుకున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజీ కాలువలన్నీ నిండిపోవడంతో జహీరాబాద్ పట్టణంలోని లైఫ్ స్టైల్ కాం ప్లెక్స్ ముందు ఉన్న ద్విచక్ర వాహనాలన్నీ మురుగు నీటిలో మునిగిపోయాయి. బస్టాండ్ ముందు బ్లాక్ రోడ్ లతీఫ్ రోడ్డులో ఉన్న వాహనాలు కూడా మురుగు నీటిలో మునిగిపో యాయి. కాగా జనాభా అనుగు ణంగా డ్రైనేజీ కాలువలను పెంచకపోవడంతో ఈ ప్రమాదం చిరుపాటి వర్షం కురిసినప్పుడల్లా సంభవిస్తుందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా రైతులకు కూడా ఈ వాన తీరని నష్టాన్ని మిగిల్చింది. జొన్న, తెల్ల కుసుమల పంటలు నీటిపాల య్యాయి. బొప్పాయి, మామిడి, జామ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వర్షానికి కొట్టుకుపోయిన గురువారం సంత

అకస్మాత్తుగా కురిసిన వడగండ్ల వర్షానికి జహీరాబాద్ పట్టణంలోని డ్రైవర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వారాంతపు గురువారం సంతలోని కూరగాయల దుకాణాలు, వివిధ సరుకుల నీటిలో కొట్టుకుపోయాయి. వర్షం ధాటికి కొనుగోలుదారులు, వ్యాపారస్తులు తమ సరుకులను వదిలిపెట్టి ఇండ్లల్లోకి పరుగులు తీయడంతో.. కూరగాయాలు తదితర సామగ్రియాలు నీటిలో కొట్టుకుపోయాయి. వారం రోజుల కష్టం వధా అయ్యిందని వ్యాపారస్తులు లబోదిబోమంటున్నారు. మున్సిపల్ అధికారులు తమ వద్ద ఒక్కొక్క దుకాణం నుంచి రూ.40, తోపుడు బండి వద్ద రూ.30 వసూలు చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి తమ కూరగాయలు అన్ని కొట్టుకుపోయాయని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.

మేడే వారోత్సవాల్ని జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి

నవతెలంగాణ సిద్దిపేట అర్బన్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. 1886లో అమెరికాలోని చికాగో నగరం హై- మార్కెట్లో 8 గంటల పని విధానం కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసి లక్షలాది మందితో నిరసన వ్యక్తం చేసినప్పుడు... అక్కడి ప్రభుత్వం ఎలాంటి హెచ్చరికలు చేయకుండా కాల్పులు జరపడంతో కార్మికులు అక్కడికక్కడే మరణించారని తెలిపసారు. ఆ రక్తం మడుగులో నిండి ఉన్న ఎర్ర చొక్కాలు తీసి వారి పోరాట స్ఫూర్తికి నిదర్శనం అని, అందుకే ఎర్రజెండా ప్రపంచవ్యాప్తంగా మేడే రోజున ఎగుర వేస్తున్నారని అన్నారు. ఆ మహత్తరమైన పోరాటం తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినం అమల్లోకి వచ్చిందన్నారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల చట్టాన్ని తన అధికార మంద బలంతో కార్మిక చట్టాలు రద్దుచేసి ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించిందని తెలిపారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో 10, 12,16 గంటల వరకు కార్మికులతో నిరంతరాయంగా పనిచేయుచుకుంటూ వారితో వెట్టి చేయిస్తున్నారని తెలిపారు. శ్రమకు తగిన ఫలితం ఇవ్వకుండా కార్మిక వర్గాన్ని దోపిడీకి గురి చేస్తున్నారని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు, పద్మ జిల్లా సహాయ కార్యదర్శులు చొప్పరి రవికుమార్,సింగిరెడ్డి చంద్రారెడ్డి, హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షుడు మామిడాల కనకయ్య,గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్ జిల్లా కోశాధికారి రాజనర్స్, భవనిర్మాణ కార్మిక యూనియన్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షు లు నరసింహులు, వివిధ యూనియన్ నాయ కులు మేకల సంపత్, స్వామి, సత్యనారా యణ, మల్లయ్య, బుచ్చయ్య, బాలరాజు, ఆండాలు పాల్గొన్నారు.



రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్



నవ తెలంగాణ - సిద్దిపేట


పట్టణ ప్రజలందరు 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను మొత్తం నుంచి 5 శాతం రాయితీ కల్పిస్తున్నదని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ కోరారు. గురువారం పట్టణంలోని మిడిల్ ట్రాన్స్ఫర్ స్టేషన్ లో పొడి చెత్త వేరు చేసి రీసైక్లింగ్‌కి పంపే పనులను ఆయన పరిశీలించారు. మిడిల్ ట్రాన్స్ఫర్ స్టేషన్ కు తరలంచిన తడి చెత్తను కంప్రెస్ చేసి బయో గ్యాస్ కొరకు తరలించే పనులను, వార్డులలో వెలుబడిన పొడి చెత్తను వేరుగా చేసి కంప్రెస్ చేసి రీసైక్లింగ్ కి తరలించే పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో గ్రామాల అభివృద్ధి భేష్

అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర బృందం కితాబు

నవతెలంగాణ-మర్కుక్: తెలంగాణలో గ్రామాల అభివృద్ధి బాగుందని అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర బృందం కితాబిచ్చారు. ఎన్ఆర్జీఎస్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను అధ్యయనం చేయడానికి అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రజాప్రతినిధులు ఇన్స్రా రూరల్ డెవలప్మెంట్ అధికారుల బృందం ఎర్రవల్లి మర్కుక్ గ్రామాలను గురువారం సందర్శించారు. ఈ గ్రామాల్లోని అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎర్రవల్లిలో నరేగా నిధులతో చేపట్టిన నర్సరీ, ఆయిల్ ఫామ్ సాగు, డంపింగ్ షెడ్, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం. ఎవెన్యూ ప్లాంటేషన్ రైతు వేదికలను వీక్షించారు. ఎఫ్ ఎఫ్ సి నిధులతో చేపట్టిన సిసి రోడ్లు మురికి కాలువలను ,గ్రామంలో 100 శాతం ప్రతి ఇంటి పైన ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్స్, ఇంటింటికి ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్ల పై అందమైన పెయింటింగ్ వాటిని పరిశీలించి సర్పంచ్ బాగ్యబిక్షపతి ద్వారా అభివృద్ధి పనులపై , జాతీయస్థాయిలో అవార్డులు ఎలా పొందారు అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రెండు గ్రామాల్లో చేపట్టిన పనులను అధ్యయనం చేసి అభినందించారు.అనంతరం ఎన్ఆర్జీఎస్ కూలీలతో మాట్లాడి సరదా గా సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో ఎపీడి కౌసల్యాదేవి, ఇంచార్జి ఎంపీడీవో రాజలింగం,సర్పంచులు బాగ్యబిక్షపతి, బాస్కర్,పంచాయతీ కార్యదర్శులు విద్యా వికాస్ రెడ్డి, మౌన,అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర బృందం ,ఎస్ డబ్ల్యూ ఏడి బగాంగ్ ఎస్ఐఆర్డీ ,టాబిన్ మారా ఎస్టీఆర్డీ, బయో కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, అంశం తేరాంగ్ దాలివర్సన్ జడ్పీచైర్మన్ తంగల్ ,రాష్ట్ర, కార్యనిర్వాహక అధికారి ఎస్కే.మున్వర్ అహ్మద్, ఎల్ఐసీ జేఆర్పీ టీఎస్ఐఆర్డీ సభ్యులు, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర వివిధ జిల్లాల జెడ్పీ చైర్మన్లు, జిల్లా, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులున్నారు.





శారదకు అంతర్జాతీయ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సోషల్ సర్వీస్ అవార్డు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారానికి చెందిన ప్రముఖ సంఘ సేవకురాలు గొల్ల గూడెం శారద హైదరాబాదులోని ఘన సభలో కళానిలయం సాంస్కృతిక సంఘ సేవ సంస్థ, అంతర్జాతీయ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సోషల్ సర్వీస్ పురస్కారాన్ని అందుకున్నారు. కాగా శారద చాలా ఏండ్లుగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి కళానిలయం సాంస్కృతిక సంఘ సేవ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి సురేంద్ర, బండ శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ తెలంగాణ రాష్ట్ర చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని.. సమాజానికి సేవ చేసుకునే మరింత బాధ్యత పెరిగిందని శారదా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

గుండెపోటుతో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు మృతి


అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు

నవతెలంగాణ-సంగారెడ్డి

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సుశీల్‌బాబు గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందారు. గురువారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం,చింత సాయి, పులిమామిడి రాజు, తెలంగాణ కమర్షియల్ టాక్స్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బంగాలి వెంకటయ్య తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి కృష్ణ యాదవ్, రాయగంటి ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుసేని ఎక్సైజ్ డిపార్ట్మెంట్ వెంకటేష్ విక్రమ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు. సునీల్ బాబు మరణానికి సంతాపం వ్యక్తం చేసి తెలంగాణ ఉద్య మంలో ఆయన చేసిన సేవలను.. ఉమ్మడి మెదక్ జిల్లాకు మరియు సంగారెడ్డి జిల్లా ఉద్యోగులకు చేసిన సేవల్ని మరువలేమని కొనియాడారు. వాళ్ళ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



వృద్ధాశ్రమాన్ని సందర్శించిన హనుమంతారావు

నవతెలంగాణ-అమీన్‌పూర్

వృద్ధాప్యంలో ఆత్మీయ పలకరింపుతోనే శాంతన చేకూరుతుందని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హనుమంతరావు అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శశిధర్ రెడ్డి సూచనలతో గురువారం అమీన్పూర్ లోని వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడి అధికారులతో కలిసి పర్యటించి వృద్ధులకు కావలసిన సదుపాయాలు, భోజన వసతులు, ఇతరత్రా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ పరిసరాలు, భోజనశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. జీవితాంతం ఎన్నో కష్టనష్టాలను అనుభవించి జీవిత చరమంకంలో వృద్ధాశ్రమాలకు చేరుకున్న వారిని అక్కున చేర్చుకోవాలని కోరారు.



వేద పాఠశాల ఉపాధ్యాయుడికి నంది పురస్కారం

నవతెలంగాణ-ఝరాసంగం

ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ వైదిక పాఠశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న కుప్పా నగర్ గ్రామానికి చెందిన శివశంకర్ నంది పురస్కారం అందుకున్నారు. గురువారం హైదరాబాద్ శ్రీ త్రినయన సాంస్కృతిక కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ, శ్రీ జగద్గురు శంకరా జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలను అందిస్తున్న పూజారులకు గుర్తించి పురస్కారాలను అందజేశారు. ఇందులో భాగంగా బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో వేద పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న శివ శంకర స్వామి వేద వాచస్పతి అనే బిరుదుతో పాటు నంది పురస్కారాన్ని అందుకున్నారు. నంది పురస్కారాన్ని మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్,దేవాదాయ శాఖ ముఖ్య సలాహాధారు మహంతయ్య స్వామి చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు.



మాజీ ఎంపీపీ వర్ధంతిలో పాల్గొన్న సంజీవ రెడ్డి

నవతెలంగాణ-నారాయణఖేడ్

రాయికోడ్ మండలం షాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ వెంకట్రావు ద్వితీయ వర్ధంతి కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు డా.పట్లోల సంజీవరెడ్డి పాల్గొన్నారు. వెంకట్రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దప్ప సర్.రాములు సెట్, దొండి పటేల్ ఎంపీటీసీ, సీనియర్ నాయకులు అంజిరెడ్డి పీఏసీఎస్ వైస్ చైర్మెన్, స్వామి దాస్ మాజీ సర్పంచ్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఆపద్బాంధవుడిగా విగ్రహం శ్రీనివాస్ గౌడ్

నవతెలంగణ-కంగ్టి

ఆపదలో ఉన్న వారికి తనవంతు చేయూతనందిస్తూ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్, విగ్రాహం రామాగౌడ్ పీపుల్స్ ట్రస్ట్ చైర్మెన్ విగ్రాహం శ్రీనివాస్ గౌడ్ ఓ ఆపద్బాంధవుడు అవుతున్నారు. మండలంలోని నాగూర్ బి గ్రామంలో వారం రోజుల క్రితం విద్యుద్ఘాతంతో ఇల్లు కాలిపోయి విజయ్ కుమార్ కుటుంబం వీధిన పడింది. ఈ విషయం తెల్సుకున్న శ్రీనివాస్ గౌడ్ గురువారం నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అదేవిదంగా బీంరగ్రామంలో దీనిస్థితిలో ఉన్న ఇరమ్మ, మంగలి లక్ష్మి కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సైతం ఫ్రీ ట్యూషన్ సెంటర్లు నడిపిస్తున్నామని.. కంగ్ట మండలంలో ఐదు ఫ్రీట్యూషన్లు నడిపిస్తున్నాయన్నారు. కాగా ఆపదలో ఉన్నవారికి ఎల్లవేళలా తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు అంజాగౌడ్, చంద్రకాంత్ గౌడ్, మల్లేశ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



త్వరితగతన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-అమీన్‌పూర్

నిర్దేశించిన లక్ష్యంలోగా అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి అధికారులను ఆదేశించారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నరేంద్ర నగర్ కాలనీ అబ్దుల్ కలాం హెూమ్స్ లో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించిన రూ.25 కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, జగదీశ్వర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆడబిడ్డకు అండగా నీలం మధు..

- మంత్రి హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా 22 మందికి, బీఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా 50 మంది ఆడపిల్లలకు.. ఒక్కొక్కరి పేరుమీద రూ.5 వేల చొప్పున ఫిక్స్ డిపాజిట్





నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆడపిల్ల పుడితే ఇంటికి మహాలక్ష్మి వచ్చిందంటారు. అలాంటి మహాలక్ష్మిల ప్రోత్సాహకం కోసం తన వంతుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమాజంలో మహిళల పట్ల గౌరవం పెంపొందించాలనే సంకల్పంతో గ్రామంలో జన్మించిన ప్రతీ ఆడబిడ్డకు తన వంతు చేయూతనందిస్తున్నారు. మంత్రి కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా.. గతేడాది రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు జన్మదినం పురస్కరించుకొని జూన్ 2న 22 మంది అప్పుడే పుట్టిన ఆడ బిడ్డలకు రూ.5 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అప్పుడు ప్రారంభిఒచిన ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతున్నది. అలాగే బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 50 మంది ఆడబిడ్డలకు రూ.5 వేల చొప్పున డిపాజిట్ చేసి మరోమారు తన ఉదారతను చాటుకున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా మండలంలోని చిట్కుల్‌లో జరిగిన కార్యక్రమంలో నీలం మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మంది శిశువుల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను చిన్నారుల తల్లులకు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆడ పిల్లలు ప్రతి ఇంటికి మహాలక్ష్మి అన్నారు. అడపిల్లలని ప్రోత్సహించే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అడుగుజాడలలో నడుస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా కేసీఆర్ కిట్, ఆడపిల్లల పెళ్ళిలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలతో చేయుతనందిస్తున్నారన్నారు. మహిళల భద్రతకు దేశంలో ఎక్కడ లేని విధంగా షీ టీంలను ప్రవేశ పెట్టి మహిళలకు రక్షణగా నిలుస్తున్నారన్నారు. దేశం గర్వించదగ్గ తెలంగాణ ముద్దుబిడ్డ కేసీఆర్ కు ముచ్చటగా మూడోసారి అధికారం కట్టబెట్టి అండగా నిలవాల్సిన గురుతర బాధ్యత అందరి మీద ఉందన్నారు. సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ తన వంతుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తాను మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి తనని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు హెల్త్ ఆఫీసర్ డా.గోపీనాయుడు, ఎంపి హెచ్ఓ కృష్ణాప్రసాద్, ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు దుర్గయ్య, కృష్ణ, భుజంగం, శ్రీను, మురళి, వెంకటేష్, రాజ్ కుమార్, యాదగిరి, ఆంజనేయులు, మాజీ పిఏసిఎస్ చైర్మెన్ నారాయణ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ప్రశాంత్, ఏఎన్ఎం వాణీ, గోపాల్, శ్రీను, అనిల్, నరేష్, వెంకటేష్, ఆశ వర్కర్లు, మహిళలు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో జోగిపేటలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-జోగిపేట

ఈనెల 29,30 తేదీల్లో జోగిపేట పట్టణంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని అందోల్ జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనాలన్నారు. జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో పోటీలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడో, నాల్గవ బహుమతులకు రూ.10 వేల చొప్పున అందజేస్తున్నామన్నారు. వీటితోపాటు బెస్ట్ ఆల్రౌండర్, బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్ లకు ట్రోఫీలు అందజేస్తామన్నారు. ఈ పోటీలకు స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. విశిష్ట అతిథిగా బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ హాజరవుతున్నారన్నారు. పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 28న మధ్యాహ్నం క్రీడా జట్ల డ్రా తీయబడుతుందని, ఈ క్రీడా పోటీల్లో ఎంపైర్ దే తుది నిర్ణయం అన్నారు. ఒక జట్టులో ఆడిన వారు మరో జట్టులో ఆడడానికి అవకాశం లేదన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జోగిపటలో జరిగే క్రీడలను ఇక్కడి ప్రాంత ప్రజలు ప్రోత్సహించాలని కోరారు.

పట్టుదల, దీక్షా సహనానికి ప్రతిరూపం భగీరథ మహర్షి



నవతెలంగాణ-సంగారెడ్డి

పట్టుదల, కృషితో ఏదైనా సాధించవచ్చన్న దానికి నిదర్శనం మహర్షి భగీరథుడు అని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ వీరారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి, భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు భగీరథుడు గంగను ఆకాశము నుండి భువికి ఎందుకు తీసుకురావాల్సి వచ్చిందో, అందుకు ఆయన చేసిన కఠోర శ్రమ గురించి వివరించారు. భగీరథ ప్రయత్నంతోనే గంగ దివి నుండి భువికి వచ్చిందన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, దేశ సంస్కృతిని సుసంపన్నం చేయడంలో పూర్వం నుండి ఎంతోమంది ఋషులు కృషి చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి కుల సమాజం అభివృద్ధి చెందేలా కృషి చేస్తుందన్నారు. మహనీయుల జయంతులు, వర్ధంతులను చేస్తూ, వారి సమాజాన్ని గుర్తు చేసుకుంటూ వారి అభివృద్ధి, సంక్షేమా నికి బాటలు వేస్తున్నారన్నారు. ఆయా కుల సమాజానికి ప్రభుత్వం ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తున్నదన్నారు. ప్రతి వ్యక్తి చదువుతోనే వృద్ధిలోకి వస్తారని, విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించి, తమ పిల్లలను బాగా చదివించి వృద్ధులోకి తీసుకురావాలని ఆయన కోరారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం సగరు కులస్తులకు రెండు కోట్ల రూపాయలతో ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నదని తెలిపారు. కాగా జిల్లా కేంద్రాల్లో సగర సమాజానికి స్థలం కేటాయించి, భవన నిర్మాణం చేయాలని, స్వయం ఉపాధి రంగంలో వారికి కేటాయింపులు చేయాలని సగర కుల ప్రతినిధులు అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ వినతులను మంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఫిరంగి, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి, సూపరిండెంట్ వెంకట నరసమ్మ, రాష్ట్ర సగర సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా సగర సంఘం ప్రధాన కార్యదర్శి నర్వా అంజయ్య, కోశాధికారి వేముల వెంకటయ్య, ఉపాధ్యక్షులు దుంపల రామనారాయణ, సహాయ కార్యదర్శులు గోనె ప్రవీణ్‌కుమార్, కొవ్వూరి శ్రీనివాస్, సలహాదారులు శెట్టి వెంకటేశ్వరరావు, మండల శివకుమార్, ఈసీ సభ్యులు నర్వ పండరి, ఉప్పర సమాజ ప్రజలు, అధికారులు, ఉద్యోగులు ,తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని మనం కాపాడితే.. ప్రకృతి మనల్ని కాపాడుతుంది

- హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ



నవతెలంగాణ-అమీన్‌పూర్

పర్యావరణాన్ని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. లోకహితం కోసం అమీన్‌పూర్ 21, 22వ కౌన్సిలర్లు ఎడ్ల సంధ్యరమేష్ దంపతులు చేపట్టిన శ్రీ రుద్రసహిత శతచండి యాగం బృహత్తరమైనదని దత్తాత్రేయ అన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి గుట్ట మీద బీజేపీ రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ ఎడ్ల సంధ్యరమేష్ దంపతుల ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగే శ్రీ రుద్రసహిత శతచండి యాగం ప్రారంభోత్సవంలో దత్తాత్రేయ పాల్గొని పూజలు నిర్వహించారు. అంతకుముందు భ్రమరాంభిక మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితం కోసం పాటుపడాలన్నారు. ఇలాంటి యాగాల ద్వారా హిందూ భావన పెరిగి ఆధ్యాత్మిక చింతన అలవడుతుందన్నారు. ధర్మాన్ని రక్షించాలన్నారు. తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు, సిరిసంపదలు కలగా లని కాంక్షిస్తూ ఎడ్ల సంధ్యా రమేష్ దంపతులు రుద్ర సహిత చండీయాగం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. తమ కోసం తాము కాకుండా ఇతరుల సంక్షేమం కోసం చండీయాగం నిర్వహించడం ఎడ్ల దంపతుల ఉదారతకు నిదర్శనమన్నారు. సంగారెడ్డి బీజేపీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, పటాన్ చెరు నియోజకవర్గం బిజెపి నాయకులు, కార్యకర్తలు ఎడ్ల రమేష్ యువసేన సభ్యులు,ఎడ్ల రమేష్ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యర్థానికి విలువ ఇవ్వగలిగితే.. వృథా కాదు



నవతెలంగాణ-పటాన్‌చెరు

వ్యర్థానికి జీవం పోయగలిగినా లేదా దానికి విలువ ఇవ్వగలి గినా.. అది వృథా కాదని వాల్యూ అనేబ్లర్ అండ్ సోషల్ ఇంపాక్ట్ ఔత్సాహిక సభ్యుడు డాక్టర్ శ్రీనివాస్ కేశవరపు అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్, స్కూల్ ఆఫ్ సైన్స్‌లో గురువారం వెల్త్ అవుట్ ఆఫ్ వేస్ట్ (చెత్త నుంచి సంపద) పేరిట సంయుక్తంగా నిర్వహించిన ఒకరోజు వర్క్ షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్త నుంచి సంపద సృష్టిని పునరుత్పాదక ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీ) అంటారని, వ్యర్థాల పునర్వినియోగం లేదా పునరుత్పాదకత చేయాలని ఆయన సూచించారు. మనం వ్యర్థం అనుకునే చాలా పదార్థాలు మరో ఉత్పత్తికి ముడిసరుకు అవుతాయన్నారు. ప్రతి పౌరుడు వృథాను తగ్గించేందుకు ప్రయత్నించాలని, దానిని సంపదగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా ఆహారాన్ని వృథా చేయెుద్దని ఉద్బోధించారు. దాదాపు 99 శాతం ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పునర్వినియోగించవచ్చని, విలువైన మూలకాలను వాటి నుంచి వెలికితీయొచ్చని చెప్పారు. స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి కె.నగేష సమన్వయంలో సాగిన బృంద చర్చలో రచయిత, వాల్యూ ఎనేబుల్ అండ్ సోషల్ ఇంపాక్ట్ ఔత్సాహికుడు వివేక్ వర్మ, టిప్ సెషన్స్ వ్యవస్థాపకురాలు దివ్య హెగ్డేలు వ్యవస్థాపకుడు, స్టార్టప్‌ల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్త స్టార్టప్‌తో సమానం కాదని, అయితే పారిశ్రామికవేత్తతో స్టార్టప్ సమానవ న్నారు. సమస్యను గుర్తించి, దాని పరిష్కారం కోసం నిరంతం ఆలోచించే మనస్తత్వం ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు ఉంటుందని, దానిని విద్యార్థులు అలవరచకుంటే వ్యవస్థాపకులుగా లేదా ఉన్నతో ద్యోగులుగా ఎదగొచ్చని వక్తలు స్పష్టీకరించారు. పారిశ్రామికవేత్త ఆలోచన వైఫల్యం చెందడంలో తప్పులేదని, కానీ, దాని నుంచి విలువైన పాఠాలు నేర్చుకుని విజయవంతమైన జీవితానికి బాటలు వేసుకోగలగాలని వారు పేర్కొన్నారు. తొలుత, బీ-స్కూల్ కేస్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కరుణాకర్.బి తన స్వాగతోపన్యాసంలో కార్యశాల లక్ష్యాలను వివరించి, అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజ్మెంట్, సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

ఆంగ్ల సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి భారతీయ భాషా పండితుల చేయూత



నవతెలంగాణ-జహీరాబాద్

ఆంగ్ల సాహిత్యాన్ని ప్రోత్సహించడంలో భారతీయ భాషా పండితుల చేయూత ఎంతో ఉందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ అస్లామ్ ఫారూఖీ అన్నారు. జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'నాకు ఇష్టమైన భారతీయ ఆంగ్ల రచయిత' పేరుతో ఒకరోజు జిల్లా స్థాయి ఆంగ్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ముహమ్మద్ అస్లామ్ ఫారూఖీ మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం విద్యార్థుల ఆంగ్ల పరిజ్ఞానానికి నేటితరం ప్రాధాన్యత పెరుగుతోందని, ఇలాంటి అవకాశాలను విద్యార్థులు పూర్తిగా వినియోగించు కోవాలని కోరారు. డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ మహ్మద్ గౌస్, డాక్టర్ నరహరి మూర్తి, డాక్టర్ విద్యాసాగర్ కూడా సెమినార్‌లో ప్రసంగిస్తూ విద్యార్థులు ఆంగ్ల భయాన్ని వీడాలని కోరారు. సరైన ఇంగ్లీషులో మాట్లాడేందుకు నిపుణులైన ఉపన్యాసాలు వినాలని, ఇంగ్లీషు వార్తాపత్రికలను క్రమం తప్పకుండా చదవాలని, అలాగే ఆంగ్లంలో ఆలోచనలను కవిత్వం మరియు గద్య రూపంలో వ్యక్తీకరించడానికి ప్రయత్నించాలని సూచించారు. కాలేజ్ మ్యాగజైన్ యొక్క రాబోయే సంచిక కోసం మరియు ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ బ్లాగ్ కోసం కంటెంట్‌ను రూపొందించడానికి విద్యార్థులు తమ రచనలను కూడా ప్రదర్శించవచ్చన్నారు. ఈ సదస్సులో సంగారెడ్డిలోని వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు తమ అభిమాన ఆంగ్ల రచయితలు, కవులపై మహ్మద్ అర్బాజ్, సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన శ్రీకాంత్ నాయక్ పత్రాలను సమర్పించారు. జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన శివ ప్రసాద్ మరియు జో, జహీరాబాద్ ఆచార్య డిగ్రీ కళాశాల నుండి శ్రావణి మరియు కావేరి. జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మెరాజ్ తర్నుం, నజియా బేగం, తానియా తహసిన్, ఇష్రత్ బేగం, సంజన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో తమ పత్రాలను సమర్పించారు. కార్యక్రమం ముగింపులో పరిశోధనా పత్రాలను సమర్పించిన విద్యార్థు లందరికీ సర్టిఫికెట్లు, మెమెంటోలను ప్రదానం చేశారు. తెలంగాణ స్కిల్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ దేవి, సెమినార్ సజావుగా సాగేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించారు.

నాపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదు

- మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతా గోపాల్



నవతెలంగాణ-సదాశివపేట

తాను భూ ఆక్రమణకు పాల్పడినట్టు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతా గోపాల్ అన్నారు. ఈ మేరకు గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదాశివపేటలోని 830 సర్వేనెంబర్‌లో గల 15 గుంటల భూమిని తాను ఆక్ర మించుకున్నట్టు ఓ పత్రికా, ఛానల్‌లో వార్తలు వచ్చాయని.. తానంటే గిట్టని వారే కావాలని ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. 1995లో ఉపాధి కోసమని తాను మునిసిపల్ కౌన్సిల్‌లో దరఖాస్తు పెట్టుకోగా.. ప్రభుత్వమే ఆ భూవిని తనకు కేటాయించిందని చింతా గోపాల్ తెలిపారు. దీనికి అప్పటి కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపిందని.. అప్పటి కౌన్సిల్ ఏకగ్రీవం చేసిన కాపీ కూడా తనవద్ద ఉన్నదన్నారు. అంతేకాకుండా ఈ భూమికి సంబంధించి అప్పటి నుంచి కరెంటు బిల్లులతో పాటు పన్నులు కూడా తాను చెల్లిస్తు న్నట్టు రశీదులు చూయించారు. అలాగే ఆ భూమి పట్టాకోసం 59 జీ.వో కింద దరఖాస్తు కూడా పెట్టుకున్నట్టు చెప్పా రు. అయితే తానంటే పడని వారే కావాలని ఇలా నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని.. వాటిల్లో నిజం లేదన్నారు.

దోమడుగులో కంటివెలుగు ప్రారంభం



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని దోమడుగు గ్రామంలో జెడ్పీటీసీ కుమార్ గౌడ్, మండల వైస్ ఎంపీపీ నక్క మంజుల వెంకటేష్ గౌడ్‌లు సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్ అధ్యక్షతన కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేయడమే కాకుండా.. అర్హులైన వారికి ఉచితంగా కండ్ల అద్దాలను కూడా అందజేస్తారని డాక్టర్ మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గోవర్ధన్ గౌడ్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నవీన్ రెడ్డి,లింగం,భద్రయ్య,నాయకులు సత్తి రెడ్డి, శేఖర్ రెడ్డి, కిరణ్, శ్రీనివాస్, సాయి, నరేందర్, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను వెంటనే మూసివేయించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

బెల్టు షాపులను వెంటనే మూసివేయించాలని.. కల్తీ కల్లు వ్యాపారులపై కేసులు పెట్టాలని, ఆల్ఫ్రోజోలం బ్యాన్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకుగ గురువారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ.. ప్రతి గల్లీలో మద్యం ఏరులై పారుతోందన్నారు. దీంతో గ్రామాల్లో యువత, ప్రజ లు మద్యానికి బానిసలుగా మారుతున్నారు. మద్యం మత్తు లో హత్యలు, లైంగికదాడులు పెరుగుతున్నాయని వాపోయారు. జిల్లాలోని ఎక్సైజ్ అధికారులు తాగుడు మాన్పిం చాల్సింది పోయి, రెవెన్యూ కోసం ప్రతి ఒక్కరూ తాగాల్సిం దేనన్న ప్రభుత్వ సిద్ధాంతాలను పాటిస్తున్నట్టు అని పిస్తోందని ఆరోపించారు. జిల్లాలో బెల్టుషాపులు, గంజాయి విక్రయా లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల పెద్దఎత్తున ఉద్యమం చెస్తామని హెచ్చరించారు. పీడీఎస్‌యూ జిల్లా సహా కార్యదర్శి జిల్లా కోశాధికారి శ్రీకాంత్, డివిజన్ నాయకులు సునీల్, సిద్ధార్థ్, వంశీ, దీక్షిత్ పాల్గొన్నారు.

డంప్‌యార్డు నుంచి 12 ఏండ్ల చెత్త తొలగింపు

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని డంప్ యార్డులో ఉన్న సుమారు 12 ఏండ్ల చెత్తను సృష్టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో.. తడి,పొడి చెత్త, ప్లాస్టిక్, ఇటుకలను వేరుచేసే కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. గురువారం డంప్‌యార్డు వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన యంత్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. జిల్లా మున్సిపల్ ఉన్నత శాఖ అధికారుల ఆదేశాల మేరకు.. సృష్టి సంస్థ వారికి తడి, పొడి చెత్త వేరు చేసేందుకు అనుమతులను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాంత్రో ఇన్‌స్పెక్టర్ సంధ్య, రాజ్ కుమార్, సృష్టి స్వచ్ఛంద సంస్థ అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM FIRST CLASS MAGISTRATE AT SANGAREDDY
O.S.No. 403 of 2023

Between:
1. Miss. Mulugu Naga Savitri Devi
D/o Late Sri M. Mallikarjuna Rao,
2. Miss. Mulugu Girija Kumari.
D/o Late Sri M.Naga Mallikarjuna Rao.
3.Mr. Mulugu Siva Prasad,
S/o Late Sri M. Mallikarjuna Rao.
4. Mr. Umamaheswara Rao Mulugu,
S/o late Sri M.Naga Mallikarjuna Rao,
5. Miss. Mulugu Santha Devi
D/o Late Sri M.Naga Mallikarjuna Rao.
6. Miss. Mulugu Sarada Devi.
D/o Late Sri NI.Naga Mallikarjuna Rao.
7. Miss. Sudha Kumari Mulugu,
D/o Late Sri M.Naga Mallikarjuna Rao

.....Plaintiffs

[Plaintiffs 1 to 7 are residing at H.No. 9-4-86/231/1. Salarjung Colony, Tolichowk Road. Hyderabad -500008.

And


The Tahsildar
Patencheru Handal. Patencheru.
2. All Concerned.

.....Defendants.

To.
The Public at large
Whereas the above named Plaintiffs have filed the above suit O.S.no. 403 of 2023 for declaring the 7th Plaintiff as legal heir of Late Sri Mulugu Ravi Kumar who expired on 5.9.2019. As the Hon'ble court ordered public notice by way of publication in newspaper, this notice is being published. Therefore. if any person has any objection, they can putforth their objections before the Hon'ble Court at **10.30am on 4.5.2023.**
Accordingly. this public notice is issued to All concerned.

BY ORDER OF THE COURT
M.V.Nagaraj.
V.V.S.Annaram
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18. Chikkadapalli, Hyderabad. Cell:98496-66587
e-mail:sripadraj16@gmail.com

నవతెలంగాణ
మెదక్
శుక్రవారం 28 ఏప్రిల్ 2023



బండారి గంగాధర్‌కు జాతీయ సేవా పురస్కారం



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్‌ను కళానిలయం సంస్కృతిక సంఘ సేవ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ సేవ పురస్కార అవార్డుకు ఎంపిక చేశారు. ఈ పురస్కారాన్ని బుధవారం రాత్రి హైదరాబాద్ చిక్కడపల్లి శ్రీ త్యాగరామ గాన సభ నిలయంలో తెలంగాణ రాష్ట్రం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బండ శ్రీనివాస్ చేతుల మీదుగా బండారి గంగాధర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ సేవా పురస్కార అవార్డులు అందుకున్నారు .ఈ సందర్భంగా అవార్డు గ్రహీత బండారి గంగాధర్ మాట్లాడుతూ తాను చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి కళానిలయం సంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ సేవా పురస్కారం అందించడం జరిగిందన్నారు. ఈ అవార్డు దక్కడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. మునుముందు మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బండారి గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పెద్ద పిల్లి మధు. టీఆర్ఎస్ జనరల్ సెక్రెటరీ పెద్దపులి శంకర్, నాగరాజు, పెద్దపులి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

- మద్దూరు వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం



నవతెలంగాణ-మద్దూరు

అకాల వడగండ్ల వర్షంతో పంట నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్ని ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకుంటుందని మద్దూరు వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఆమె తెలిపారు. రైతులకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే ఉండే ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని తెలిపారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి ఎకరాకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. పంట నష్టపోయిన ఏ రైతు అధైర్య పడద్దని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి, ధర్మారం సర్పంచ్ రవీందర్ రెడ్డి, పిఏసీఎస్ డైరెక్టర్ ఊట్కూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభం







నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి మండల కేంద్రంలో పీఏసిఎస్ చైర్మన్ శంకర్ గౌడ్, మండలంలోని సంకాపూర్, జప్తీ శివనూర్, నర్సంపల్లి, నర్సంపల్లి తాండా, వల్లూరు, శేరిపల్లి గ్రామాలలో ఐకేపీ సీసీలు శంకర్, సుల్తానా, ఏఓ విజృంభణల ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపీపీ సబిత, జెడ్పీటీసీ కృష్ణా రెడ్డిలు కొబ్బరి కాయలు కొట్టి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సబితా, జెడ్పీటీసీ కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనడానికి ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రభుత్వం వరి ఏ గ్రేడ్ రకానికి రూ.2060లు, బీ గ్రేడ్ రకానికి రూ.2040 లు కనీస మద్దతు ధర నిర్ణయించిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం వర్షానికి తడవ కుండా కవర్లను అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం అమ్మిన వారం రోజుల్లోగా వారి వారి బ్యాంకు ఖాతాలలో నేరుగా డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల బాగు కోసం మండల నాయకులు అందరూ కలసికట్టుగా కృషి చేస్తా మన్నారు. రైతులు క్రమ పద్ధతిలో ధాన్యం విక్రయించాలని, పోల్లు లేకుండా తేమ నిర్దిష్ట శాతం ఉంచినట్లయితే బస్తా 41 కేజీలు మాత్రమే పెట్టాలని సూచించారు. కొనుగోలుదారులు, రైతులు పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏర్రం అశోక్ గుప్తా, ఎంపీటీసీ సత్యనారాయణ, ఎంఆర్ఓ సత్యనారాయణ, రైతు బంధు అధ్యక్షుడు లింగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, ఆకుల మల్లేశం గౌడ్, నరసింహ చారి, శ్రీపతి రావు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేగుంట

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి జయరాజ్, జెడ్పీటీసీ శ్రీనివాసులు అన్నారు. చేగుంట మండలం వడియారం గ్రామంలో ఐకెపి (సెర్ఫ్) ఆధ్వర్యంలో ఐకేపీ కార్యాలయంలో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆనందమేరి మాట్లాడుతూ ప్రతి రైతు పండించిన వరి ధాన్యం గింజ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకోవాలని, వారికి సరైన గిట్టుబాటు ధర కూడా లభిస్తుందని, రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్, పట్టా పాస్ బుక్‌లతో కొనుగోలు కేంద్రం వద్ద సంబంధిత అధికారులకు అందజేసి వరి ధాన్యం కొనుగోలు చేసుకుని సకాలంలో డబ్బులు పొందాలని వారు తెలిపారు. ఎట్టి పరిస్థితులలో దళారులను నమ్మొద్దు, రైతులు మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దనే వరి ధాన్యం అమ్ముకోవాలి, వారికి ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే తూకంలో ఏమైనా మోసం జరిగినట్లయితే తక్షణమే అధికారులకు తెలియజేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల నర్సింలు, ఎంపీటీసీ భిక్షి లక్ష్మీ రమేష్, ఐకెపి కొనుగోలు సెంటర్ ఇన్చార్జి బో ళ్ళ రామస్వామి, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి శోభ, నాయకులు జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క సారి కూడా సమావేశానికి హాజరుకాని ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

- ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన ప్రజాప్రతినిధులు
- అనేక సమస్యలకు నిలయం నిజాంపేట మండలం







నవతెలంగాణ-నిజాంపేట

మండలాల పునర్విభజనలో భాగంగా నిజాంపేట నూతన మండలంగా ఏర్పడి దాదాపు ఏడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ, నిజాంపేట మండల సర్వసభ్య సమావేశానికి ముగ్గురు ప్రజాప్రతినిధులు ఒక్క సారి కూడాహాజరు కాకపోవడం చాలా శోచనీయం. ప్రోటోకాల్ ప్రకారం వీరి పేర్లు ఫోటోలు సమావేశంలో ఫ్లెక్సీల పైన ముద్రిస్తారు కానీ వీరు మాత్రం సమావేశానికి రారు. ప్రజాసేవ చేస్తామని చెప్పి ఎన్నికలలో నిలబడి గెలిచిన తర్వాత ప్రజా సమస్యలను మరవడమే కాకుండా కనీసం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు హాజరు కాకపోవడమేమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిజాంపేట మండల ప్రజల సమస్యలను తీర్చుతామని చెప్పి ఎన్నికలలో గెలిచిన తర్వాత మండల సమస్యలను గాలికి వదిలేసిన ప్రజా ప్రతినిధులు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలం చుట్టూ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక ప్రజలు రోగాల బారిన పడి అనేక ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ కార్పొరేట్ ఆసుపత్రులలో చూపించుకోలేక ఆర్థిక పరిస్థితి బాగాలేక సగం మంది మరణిస్తూనే ఉన్నారు. విద్యాపరంగా చూస్తే నిజాంపేట మండలంలోని గ్రామాల ప్రజలు విద్యాపరంగా వెనుకబడి ఉన్నారు. 10వ తరగతి వరకే చదువును మధ్యలోనే ఆపేసి కూలీలుగా మారుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ, పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రానికి గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా హాస్టల్, ఎప్పుడో కట్టాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ ఎలాంటి ఆచరణ చేపట్టకపోవడం విడ్డూరంగా ఉంది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మంత్రి హరీశ్‌రావు దాదాపు 3 సంవత్సరాల క్రితం భూమి పూజ చేసినప్పటికీ ఎలాంటి పనులు మొదలు పెట్టకపోవడం, ఆ పథకమే రద్దు చేయబడిందని చెప్పడంతో ఎంతోమంది ఆశతో ఎదురు చూసిన కుటుంబాలు ఒక్కసారి షాకు గురయ్యారు (అవాక్కైనారు). ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజా ప్రతినిధులు పోటాపోటీ ప్రచారాలకు ఎగబడుతున్నారు. మండల ప్రజలారా తస్మాత్ జాగ్రత్త .

ఎంపీపీ కూతురికి వస్త్రాలంకరణ



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల ఎంపీపీ మాసుల శ్రీనివాస్ తన కూతురు శ్రీనిధి వస్త్రాలంకరణ దినోత్సవం గురువారం నిర్వహించారు. చేగుంట మండలం వడియారం గ్రామం ఎస్ఎల్‌వీఎన్ ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ మాసుల శ్రీనివాస్, పుష్పలతల కూతురు వస్త్రాలంకరణ మహోత్సవానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, జర్నలిస్టులు, ప్రజలు, బంధువులు హాజరై శ్రీనిదిని ఆశీర్వదించారు.

మామిడి తోటలను పరిశీలించిన ఏడీఏ సురేఖ



నవతెలంగాణ-నర్సాపూర్

గత రెండు రోజులుగా కురిసిన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాల వల్ల మామిడి తోటలకు వరి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. గురువారం నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడీఏ సురేఖతోపాటు ఏడిహెచ్ నరసయ్య, ఏవో అనిల్ కుమార్, ఏఈఓ శిరీషలు కలిసి నష్టపోయిన పంటలను, మామిడి తోటలను వారు పరిశీలించారు. నర్సాపూర్ మండల పరిధిలోని చిన్నచింతకుంట, రెడ్డిపల్లి, కాజీపేట, తదితర గ్రామాల్లో దెబ్బతిన్న మామిడి తోటలను వారు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఏ సురేఖ మాట్లాడుతూ సుమారు 182 ఎకరాల మామిడి తోటల్లో మామిడి కాయలు నేల రాలిపోయి మామిడి తోట యజమానులకు తీవ్రంగా నష్టం కలిగిందన్నారు. ఈ గ్రామాలలో కొంతమేర వరి పంటలు స్వల్పంగా నష్టం కలిగిందని తెలిపారు.

ఏడుపాయల అడవిలో యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సాధు సాయికుమార్ (25) ఏడుపాయల అటవీ ప్రాంతంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పాపన్నపేట ఎస్సై విజయ్ కుమార్ వెల్లడించారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన అంతయ్య, మంజుల కుమారుడు సాయికుమార్ ఏడుపాయల కమాన్ సమీపన టెంట్ హౌస్‌లో పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. అయితే ఇటీవల 28.03.2023 నుంచి కనిపించకుండా పోయాడు దీంతో కుటుంబ సభ్యులు పాపన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా గురువారం సాయికుమార్ మృతదేహం ఏడుపాయల అడవి ప్రాంతంలో లభ్యం అయింది, ఈ విషయమై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సమగ్ర విచారణ చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల పరిధిలోని నంద గోకుల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బాల్ రెడ్డి కుమారుడు జ్ఞానేశ్వర్ రెడ్డి వివాహం సందర్భంగా గురువారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి స్వగృహంలో కలిసి వివాహానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

రైస్ మిల్లులో ధాన్యం నిల్వ ఉంచుకోవాలి

- ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోపరేటివ్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శ్యామ్ కుమార్



నవతెలంగాణ-కౌడిపల్లి

రైతులు పండించిన పంటను మార్కెట్లో మద్దతు ధర లేనప్పుడు రైస్ మిల్‌లో ధాన్యాన్ని నిలువ ఉంచుకోవాలని డాక్టర్ శ్యామ్ కుమార్ రైతులకు సూచించారు. నిల్వ ఉంచిన పంటలకు నిబంధనల ప్రకారం రుణాలను సైతం అందించడం జరుగుతుందన్నారు. నిలువ ఉంచిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర వచ్చినప్పుడు రైతులు అమ్ముకునే విధంగా సహకరిస్తామని తెలిపారు. గురువారం కౌడిపల్లిలో గిడ్డంగుల అభివృద్ధి నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ప్రతి రైతు సహకార సంఘం పరిధిలో గోదాములను నిర్మించడం జరుగుతుందని వాటిని ఉపయోగించుకోవాలని డాక్టర్ శ్యామ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి శంకర్, అగ్రికల్చర్ అధికారి రాజశేఖర్, నరేష్, సీఈవో దుర్గయ్య గౌడ్, సుధాకర్, విష్ణు రైతులు ఉన్నారు.

సొసైటీ అనుకూలంగా ఉండే రైతులకే సమాచారం

మహమ్మద్ నగర్ సొసైటీ అధికారులు ఏ సమావేశం చర్చించినా వారికి అనుకూలంగా ఉండే రైతులను సమావేశాలకు పిలుస్తారు. సమావేశాల్లో వ్యతిరేకంగా మాట్లాడిన రైతులను ఆ సమావేశాలకు సమాచారం ఇవ్వరు . ఇది గత కొంతకాలంగా మహమ్మద్ నగర్ సొసైటీలో జరుగుతున్నా ఏ అధికారులు పట్టించుకోరు. రైతుల సమస్యలు చెప్పుకుందామంటే అధికారులు అన్ని గ్రామాల రైతులకు సమాచారం ఇవ్వడం లేదని, సమాచారం ఇస్తే సమస్యలపై ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతోనే అన్ని గ్రామాల ప్రజలకు సమాచారం ఇవ్వకుండా నామ్‌కే వాస్తేగా మీటింగులు పెట్టి ముగిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, మరోవైపు వడగళ్ల వర్షానికి రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలపై అధికారులను తెలుసుకుందామంటే సమాచారం ఇవ్వకుండానే మీటింగ్ పెట్టి ముగించుకోవడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంట నష్టపోయిన రైతులు ఆందోళనకు గురికావద్దు

- ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-మెదక్ రూరల్

మెదక్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన వడగళ్ళ వాన, భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులు ఏమాత్రం ఆందోళనకు గురికావద్దని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి నివేదికలు అందచేస్తున్నామని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి భరోసా కల్పించారు. హవేళీ ఘనపూర్ మండలంలోని ఫరీద్‌పూర్, పాపన్నపేట మండలంలోని ఎల్లాపూర్, లక్ష్మిపూర్ గ్రామాల్లో వర్షాలు, వడగళ్ళ వానకు నష్టపోయిన పంటపొలాలను స్వయంగా వెళ్ళి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించి ఎన్ని ఎకరాలో పంట వేశారు ప్రస్తుతం ఏ దశలో ఉంది ఎంత మేర పంట నష్టం జరిగిందనే వివరాలను అడిగి తెలుసుకొన్నారు. పంట నష్టం వివరాలను ప్రభుత్వం సూచించిన మేరకు ఆయా శాఖల అధికారులు సైతం క్షేత్రస్థాయిలో వెళ్ళి తెలుసుకొంటున్నారని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఆశాకుమారి, హవేళీ ఘనపూర్ మండల వ్యవసాయాధికారిణి నాగమాధురి, పాపన్నపేట వ్యవసాయాధికారి క్రిష్ణ వ్యవసాయ విస్తరణ అధికారులు భార్గవ్, జనార్ధన్, అభిలాష్, రైతులు తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి..

- ప్రెస్ క్లబ్‌కు రూ.15 లక్షలు మంజూరు
- మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డిలకు కృతజ్ఞతలు
- మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొంతి నరేష్ గౌడ్



నవతెలంగాణ-మెదక్ రూరల్

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రెస్ క్లబ్ నిరంతరం కృషి చేస్తున్నట్లు మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొంతి నరేష్ గౌడ్, ఎర్ర ప్రసాద్ గౌరవ అధ్యక్షులు కామాటి కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహ చారిలు పేర్కొన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని ప్రెస్ క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ. మెదక్ ప్రెస్ క్లబ్ భవనం ఏర్పాటుకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి గతంలో నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద రూ.20 లక్షలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆ నిధులతో ప్రెస్‌క్లబ్ భవనపు పనులు స్లాబ్ లెవల్ పూర్తి చేయడం జరిగిందన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రెస్ క్లబ్ నిర్మాణపు పనులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించాలని ఇటీవల మెదక్ పర్యటనకు వచ్చిన జిల్లా ఇంచార్జి మంత్రి హరీశ్‌రావును ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి నేతృత్వంలో విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుగులంగా స్పందించినట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ద్వారా రూ.15 లక్షలు విడుదల చేస్తూ ప్రొసీడింగ్ జారీ చేశారు. ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి కృషితో మంజూరు అయిన రూ.15 లక్షలతో ప్రెస్ క్లబ్ భవన నిర్మానపు పనులు పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రెస్ క్లబ్ భవనాన్ని అత్యాధునిక హంగులతో నిర్మిస్తామన్నారు. నిధులు కావాలని విజ్ఞప్తి చేసిన వెంటనే రూ15 లక్షలు మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావుకు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిలకు ప్రెస్ క్లబ్ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్‌క్లబ్ సలహాదారులు రాజశేఖర్, నవీన్, సురేందర్ రెడ్డి కోశాధికారి సంఘమేశ్వర్, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు బీవీకే రాజు, రాదువ లక్ష్మణ్ సిద్దు, లక్ష్మీనారాయణ, రాజాగౌడ్, రాజశేఖర్ గౌడ్, సందీప్, శ్రీనివాస్, భువనగిరి చంద్రశేఖర్, కానుగు పరుషరాం, కార్తీక్, యూసుఫ్, నవీన్ రెడ్డి, వంశీ, అంజనేయులు, తదితరులు ఉన్నారు.

రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం


- బీజేపీ రాష్ట్ర నాయకులు, మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్



నవతెలంగాణ-నర్సాపూర్

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు రైతులు బీఆర్ఎస్ పార్టీని బొంద పెడతారని బీజేపీ రాష్ట్ర నాయకులు నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్ అన్నారు. గురువారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో స్థానిక విలేకరులతో మురళీధర్ యాదవ్ మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు పండించిన పంటలు తీవ్రంగా నష్టం కలిగిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా పరిహారం చెల్లించడం లేదన్నారు. తెలంగాణ ప్రాంతంలోని రైతులను పట్టించుకోకుండా సీఎం కేసీఆర్ మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో రైతులకు అన్ని విధాల ఆదుకుంటామని చెప్పడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 9 లక్షల ఎకరాల పంటలు నష్టం కాగా కేసీఆర్ పట్టించుకోవడం లేదని అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ రైతులకు ఓరగబెట్టిందేమీ లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు పోసుకొని అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి ఉంటే రైతులకు పంట నష్టపరిహారం లభించేదన్నారు. ఈ విధంగా కేసీఆర్ రైతులను మోసం చేస్తూ రైతుల భూములను ఆక్రమించుకుంటున్నారన్నారు. రైతుల కోసం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు రైతులు తగిన బుద్ధి చెప్తారని , బొంద పెడతారన్నారు. రైతులకు పంట నష్టపరిహారం చెల్లించని యెడల బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కౌన్సిలర్లు బుచ్చేష్ యాదవ్, ఎరుకల యాదగిరి, నాయకులు రమేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గోనె మైసమ్మకు బండ్లు ఊరేగింపు



నవతెలంగాణ-వెల్దుర్తి

మహిషాసుర మర్దిని గోనె మైసమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలో పలు గ్రామాల నుంచి అంగరంగ వైభవంగా బండ్లు బోనాలు అమ్మవారికి చుట్టూ తిరిగి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు అనంతరం గావు రంగం, పట్టు వస్త్రాలు వోడిబియ్యాలను సమర్పించారు. భక్తులు వినూతన రీతిలో భాగంగా ఎడ్లబండ్లను ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. కుల సంఘాలు కచ్చితంగా ఈ పండుగను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

నూతన ఎస్సైగా రమేష్

- బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ నూతన ఎస్సైగా రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలు పరిరక్షించే విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు . విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహచరులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు . అసాంఘిక శక్తులపై, అపరిచిత వ్యక్తులపై నిఘా వేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ లింగం మెదక్‌కు బదిలీపై వెళ్లారు.

వధూవరులను ఆశీర్వదించిన దామోదర్ రాజనర్సింహ

నవతెలంగాణ-రేగోడు

మండలంలోని కొండాపురం మాజీ సర్పంచ్ పండరి కూతురు నవీన-నాగరాజుల వివాహానికి మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, ప్రాథమిక పాఠశాల చైర్మన్ బసవరాజ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భద్రత భరోసా కోసమే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమం

- మెదక్ రూరల్ సీఐ విజయ్
- అప్పాజీపల్లి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు



నవతెలంగాణ-కొల్చారం

ప్రజల భద్రతకు భరోసా కోసమే కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మెదక్ రూరల్ సీఐ విజయ్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మెదక్ సర్కిల్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా గురువారం కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన ధృవ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మెదక్ రూరల్ సీఐ విజయ్ మాట్లాడారు. కమ్యూనిటీ కనెక్ట్ ద్వారా నేరరహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అందులో భాగంగా స్థానిక ప్రజలకు ఎలాంటి అభద్రత భావం లేకుండా ఇలాంటి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై, నేరస్తుల కదలికపై నిరతరం నిఘా ఉంటుందన్నారు. అలాగే గ్రామంలో స్థానికంగా ఏలాంటి గొడవలకు పోకుండా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో వుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ గౌడ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జెడ్పీటీసీ ఆర్థిక సాయం



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని శభాష్ పల్లి గ్రామంలో రెండు బాధిత కుటుంబాలకు గురువారం శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా ఆర్థిక సహాయం అందజేశారు. శభాష్ పల్లి గ్రామానికి చెందిన నా సర్మియా అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు . అదే గ్రామానికి చెందిన అకాల వర్షంతో ఫయాజ్ ఇల్లు కూలిపోవడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఐదువేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా తాను పనిచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి సత్యం, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పిట్ల సత్యనారాయణ, నాయకులు ఇస్మాయిల్, యాదగిరి, విజయ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నేడే రెడ్డి సోదరుల ఆత్మీయ సమ్మేళనం

- రెడ్డిల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి
- రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు



నవతెలంగాణ-నిజాంపేట

రెడ్డి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మెదక్‌లో జరిగే రెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి రెడ్డి సోదరి, సోదరులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మెదక్ జిల్లా రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పన్యాల వెంకటరెడ్డి, పప్పుల భరత్ రెడ్డి, పెద్ద పైడి ప్రదీప్ రెడ్డిలు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 ఎన్నికల మానిఫెస్టోలో పెట్టిన రెడ్డి కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మెదక్ జిల్లాలో రెడ్డిల ఐక్యతకు కృషి చేస్తున్న అధ్యక్షులు ఒంటరి రాజేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలకు, రెడ్డి సంఘ సోదరులకు, ప్రముఖులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ ఆత్మీయ సమ్మేళనానికి రెడ్డి సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్



నవతెలంగాణ రాయపోల్

మూడు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు పంటలు నేల రాలిపోయాయని, ప్రభుత్వం నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజాసేవకురాలు మహమ్మద్ సుల్తానా ఉమర్ అన్నారు. వడగండ్ల వానలకు వరి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఈదురుగాలులతో కురిసిన వడగండ్ల వానకు వరి పంటలు పెద్ద ఎత్తున నేలపాలైందన్నారు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో వ్యవసాయ అధికారుల చేత సర్వే నిర్వహించి పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-మిరుదొడ్డి

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, వ్యవసాయ అధికారి మల్లేశం అన్నారు. మిరుదొడ్డి మండలం ఆల్వాల గ్రామంలో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని, రైతులు ఎవరు అధైర్య పడవద్దని సూచించారు. క్షేత్రస్థాయిలోకి వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వచ్చి నష్టపోయిన పంటలను పరిశీలించి నష్టపరిహారం అందే విధంగా రైతుల పేర్లను నమోదు చేయడం జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా వ్యవసాయ అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఉదయశ్రీ, సర్పంచ్ కిష్టయ్య రైతులు పలువురు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయానికి కూలర్లు బహుకరణ

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయానికి సిద్దిపేట పట్టణంలోని మాంగళ్య షాపింగ్ మాల్ యాజమాన్యం గురువారం రెండు కూలర్లను బహుకరించారు. షాపింగ్ మాల్ ప్రతినిధులు కూలర్లను ఆలయ అధికారులకు అప్పగించారు. వీటిని భక్తుల సౌకర్యం కోసం వినియోగించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బిక్షపతి ఏ ఈ ఓ శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ ఉన్నారు

ఘనంగా పెద్దమ్మ పెద్దిరాజు కల్యాణం



నవతెలంగాణ-మిరు దొడ్డి

దుబ్బాక నియోజకవర్గం అక్బర్ పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలో పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు సోలీపేట సుజాత, గ్రామ అధ్యక్షులు పోతారం సురేశ్, మాజీ గ్రామ అధ్యక్షులు ఇదరి కనకయ్య, మాజీ సర్పంచ్ రాములు, మాజీ ఎంపీటీసీ లక్ష్మినర్సు, డైరెక్టర్ అభిలాష్, యూత్ అధ్యక్షులు పడల రాజు, బీఆర్ఎస్వీ అధ్యక్షులు అరవింద్, బీఆర్ఎస్ నాయకులు డి.కనకయ్య, రామస్వామి, సతీష్, నాగరాజు, సోహెల్, జెల్లు, కర్ణకర్, నేరేల నవీన్, తదితరులు ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ తనిఖీ, పనితీరు పరిశీలన



నవతెలంగాణ-సిద్దిపేట

ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ తనిఖీ , పనితీరు పరిశీలించడానికి సాయి కోచ్ మన్నే చేతన్ గురువారం సిద్దిపేట పట్టణానికి వచ్చారు. సైకిల్ సెంటర్‌లోని సైకిళ్లను, అన్లైన్లో ఉన్న విద్యార్థుల పేర్లను పరిశీలించారు. సైకిల్ నేర్చుకుంటున్న క్రీడాకారులతో కొంతసేపు ముచ్చటించారు. అనంతరం ఇటీవల గోవతి అస్సాంలో జరిగిన ట్రాక్ నేషనల్ పోటీలలో బ్రాంచ్ మెడల్ సాధించిన రామకృష్ణను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కోచ్ సంజీవ్ మాట్లాడుతూ సాయి కోచ్ మన్నే చేతన్ సహకారంతోనే ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ సిద్దిపేటకు వచ్చిందన్నారు. సౌకర్యాలను చూసి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. డిస్టిక్ స్పోర్ట్స్ యూత్ ఆఫీసర్ నాగేందర్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు సైక్లింగ్‌పైన మెలకువలను, అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ ప్రవీణ్, సైకిల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-ములుగు

మండల పరిధిలోని ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన ములుగులో చోటు చేసుకుంది. ములుగు ఎస్సై రంగకృష్ణ తెలిపిన వివరాలు కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బూరుగుల శారద భర్త బాలు గౌడ్ వయసు (38) బస్వాపూర్ గ్రామంలో నుంచి ఉప్పల్ వెళ్తుండగా భర్త బాలు గౌడ్ తన బావ కూతురు రమ్య శారద ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ బయలుదేరి వెళుతున్నారు. ములుగు శివారులోని ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా రాజీవ్ రహదారిపై వారు వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడగా వెనకాల కూర్చున్న బూరుగుల శారద రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుకాల వస్తున్న డీసీఎం డ్రైవర్ డీసీఎంను అతివేగంగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి ముందున్న ఎర్టిగా కారును ఢీకొట్టి, శారదపై ముందు గల టైరు ఎక్కగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో శారద అక్కడికక్కడే మృతి చెందారు. అజాగ్రత్తగా డీసీఎం నడిపిన డ్రైవర్ సంపత్‌పై తగు చర్యలు తీసుకోవాలని మృతురాలి బావ రాజు గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్ఐ శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఇంద్రుప్రియల్ లో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ



నవతెలంగాణ- దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇంద్రుప్రియల్ గ్రామంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్థానిక సర్పంచ్ సూరంపల్లి శ్యామల కుమార్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుచేసి సుమారుగా 14 సంవత్సరాల క్రితం అప్పటి మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి విగ్రహాన్ని సొంత ఖర్చులతో ఇప్పించడం జరిగిందన్నారు. కొన్ని అనివార్య కారణాలవల్ల దశాబ్ద కాలం పాటు ప్రారంభోత్సవానికి దూరంగా ఉన్న ఆ మహనీయుని విగ్రహం ఆవిష్కరణ చేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ చేతన ఐపీఎస్, ఏసీబీ జెడి, శివ కుమార్ ఐఏఎస్, జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్, చైర్మన్ సాయి చందు, ఏ. బాలాజీ నాయక్ డిఎస్పి సంగారెడ్డి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్, భీమ సేన, సీనియర్ జర్నలిస్టు బండారు రాజు, మాల మహా నాడు రాష్ట్ర కోఆర్డినేటర్, తప్పు శివరాజ్, తుమ్మ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మైస రాము లు, కార్యక్రమానికి హాజరవుతారని ఆమె తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం

- సుమారు 50 వేల ఎకరాల వరకు పంట నష్టమని ప్రాథమిక అంచనా
- తక్షణమే ఆర్థిక సహాయం అందించాలి: సీపీఎం





నవతెలంగాణ - సిద్దిపేట

మారుతున్న వాతావరణ పరిస్థితులు, అకాల వర్షం రైతన్నను నిలువునా ముంచింది. చేతికి వచ్చిన పంట నేలరాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మార్చి చివరి వారంలో కురిసిన అకాల వర్షాలను రైతులు మర్చిపోకముందే. మరోసారి అలాంటి పరిస్థితే ఎదురయింది. మొదటిసారి నష్టపోయిన పంటకు ప్రభుత్వం ప్రకటించిన సాయం అందకముందే మరోసారి పంట నష్టపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. జిల్లా వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో అన్ని రకాల పంటలు సుమారు 50 వేల ఎకరాల వరకు నష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఈ యాసంగి లో 3,46,797 ఎకరాలలో వరి సాగు, 16, 883 ఎకరాలలో మొక్కజొన్న పంట, 7, 228 ఎకరాలలో పొద్దుతిరుగుడు, 5,800 ఎకరాలలో ఇతర పంటలు రైతులు వేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. గత కొన్ని రోజులుగా పడుతున్న వడగళ్ల వాన, అకాల వర్షాల మూలంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 50 వేల ఎకరాల్లో రైతులకు పంటల నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. 46,012 ఎకరాల వరి పంట, 456.5 ఎకరాల మొక్కజొన్న, 500 ఎకరాలలో పండ్ల, కూరగాయల తోటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమిక నివేదిక రుపొందించారు.

పంటల పరిశీలనలు

ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు బుధవారం సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గం లోని పలు గ్రామాలలో పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ గజ్వేల్ నియోజకవర్గంతో పాటు, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గం లోని పలు గ్రామాలలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది పంట నష్టం జరిగిన ప్రతి మండలంలోని గ్రామాలను పరిశీలించి అంచనా వేస్తున్నారు.

ఎకరాకు రూ 40 వేల ఆర్థిక సహాయం

అకాల వర్షంతో జిల్లాలో పంటను నష్టపోయారు. నష్టం జరిగిన ప్రతి ఎకరాకు ప్రభుత్వం తక్షణమే రూ.40 వేల ఆర్థిక సహాయం అందించాలి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అధికారులకు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించాం. అధికారులు ప్రజాప్రతినిధులు పర్యటనలకు పరిమితం కాకుండా, నష్టపోయిన వారికి సహాయం అందే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయాన్ని విడుదల చేసి, అందించాలి.



- ఆముదాల మల్లారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

కారణజన్ముడు సీఎం కేసీఆర్



నవతెలంగాణ-తొగుట

జల దృశ్యంలో చిన్న ధారగా మొదలై తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం సబ్బండ వర్గాలను తనతో కలుపుకొని దశాబ్దాల కలను సాకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ 22 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ సాధించుకొన్న తెలంగాణ రాష్ట్రాన్ని సకల జనుల ప్రగతి వేదికగా మార్చి బంగారు తెలంగాణగా తీర్చిదిద్ది, భారతదేశ అభివృద్ధి కొరకు బయలుదేరడం మహా యోధుడు సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాక ముందు గుక్కెడు తాగు, సాగునీటికోసం, కరెంటు కోసం అష్టకష్టాలు పడ్డామని గుర్తు చేశారు. తెలంగాణ అంటేనే వెక్కిరించిన గొంతులు, నేడు మన వెన్నంటి వొచ్చేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్ కార్యదీక్షా దక్షతకే దక్కుతుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ముందుకు సాగిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు సిరినేని గోవర్ధన్ రెడ్డి,రైతుబంధు మండల అధ్యక్షులు బోధ నం కనకయ్య, సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, ఎంపీటీసీ శరత్, మాజీ మండల్ పార్టీ అధ్యక్షులు చిలివేరి మల్లారెడ్డి, కుంబాల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బక్క కనకయ్య,మండల యూత్ అధ్యక్షులు మాదాసు అరుణ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నరేందర్ గౌడ్ సయ్యద్ అమీర్, సంతోష్, నాయకులు సుతారి రమేష్, బిక్కనూరి శ్రీశైలం, మంగ నర్సింలు, బోయిని శ్రీనివాస్, తగరం అశోక్, రాఘవులు, స్వామి,మాష్టి కనకయ్య,బోయిని బాలరాజ్,కల్లెపు నరేష్, పులిగారి గణేష్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులతో రాజకీయం చేయొద్దు

- ఎమ్మెల్యే రఘునందన్ రావు



నవ తెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు గురువారం పర్యటించారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శక్తి కేంద్రం సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గడిచిన రెండు మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన సోయిలేక రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న 18 గ్రామాల్లో నష్టాన్ని పర్యటించి రైతులకు భరోసా ఇచ్చామని అన్నారు. మిగతా గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గత మార్చి నెలలో వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రాంతాల్లో సీఎం కెసిఆర్ పర్యటించి రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందజేస్తామని జీవో విడుదల చేసిన విషయాన్ని హరీష్ రావుకు గుర్తులేదా? అని మండిపడ్డారు. రైతులకు పంట నష్టం వాటిల్లి అన్యాయం జరిగితే కూడా రాజకీయం చేయడం తప్ప రాళ్ల పడి రైతన్నలు కష్టాల్లో ఉంటే రఘునందన్ రావు తిట్టేందుకే ఆర్థిక మంత్రి హరీష్ రావు దుబ్బాకలో పర్యటించారని ఎద్దేవా చేశారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలు కట్టిన పన్నుల నుండి ఇవ్వాల్సిందే తప్ప తమ ఇంట్లో నుంచి ఇవ్వరనే విషయాన్ని హరీశ్‌రావు గుర్తుంచుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన ఎన్డీఆర్ఎఫ్ నిధుల నుండి వెంటనే పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సొంత ఖర్చులతో కుర్మ సంఘానికి బోరు మోటార్, సొంత ఖర్చులతో నిర్మించనున్న కుమ్మరి సంఘ భవనానికి భూమి పూజ చేశారు. నిర్మాణంలో ఉన్న పెద్దమ్మ ఆలయానికి తన వంతు సహాయం అందజేస్తానన్నారు. గ్రామంలో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం కోసం ముప్పై వేల రూపాయల తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషన్, కోనాయిపల్లి సర్పంచ్ సురేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి,రామస్వామి గౌడ్, ఉపాధ్యక్షుడు గడ్డమీది స్వామి,కుమ్మరి నర్సింలు, ముత్యాల శ్రీను, సత్యనారాయణ గౌడ్,లక్ష్మణ్, రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 ఏండ్ల టీఆర్ఎస్‌లో అన్ని విజయాలే

- మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



నవతెలంగాణ -గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఆవిర్భమైన టీఆర్ఎస్ 22 ఏళ్లలో అన్ని విజయాలే సాధించిందని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2001లో ఆవిర్భంచిన టీఆర్ఎస్ పార్టీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రెండుసార్లు తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంతో పాటు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది తెలంగాణ రాష్ట్రంలోని అనేక పథకాలను అందుకుందన్నారు. గజ్వేల్ నుండి ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఉండడంతో అభివృద్ధి చెరవేగంగా జరుగుతుందన్నారు. 2014 తెలంగాణ రాష్ట్రం సాధించి తొలి తెలంగాణ ప్రభుత్వంగా ఏర్పడి ప్రజలకు సేవలు అందించిన ప్రభుత్వానికి 2018లో మళ్లీ అధికారం ఇచ్చారన్నారు. 2023లో కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిప ల్ అన్ని రంగాల అభివృద్ధి చెందు తుందని ఆయన చెప్పారు. మరో 30 ఏళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటుందని చెప్పారు.

ఎకరాకు 30 వేల పంట నష్టపరిహారం చెల్లించాలి

- జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్



నవతెలంగాణ-చేర్యాల

భారీ వడగండ్ల వర్షానికి వరి, మామిడి పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం భరోసా కల్పించి ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రైతుల పక్షాన మండల కేంద్రంలోని అంగడి బజార్ వద్ద రైతు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎస్.కె ఆరిఫాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ రైతులు లక్షల్లో పెట్టుబడులు పెట్టి ఆరుగాలం ఎంతో కష్టపడి పండించిన వరి పంట చేతికందే సమయంలో గత మూడు రోజులుగా కురిసిన భారీ వడగండ్ల వర్షానికి పూర్తిగా దెబ్బతిని వడ్లు నేలపాలు కావడం అత్యంత బాధాకరమన్నారు. మామిడి, కూరగాయల పంటలు దెబ్బతిని పెద్ద మొత్తంలో నష్టం జరిగి రైతాంగానికి కన్నీళ్లు మిగిల్చిందన్నారు. పూరి గుడిసెలు, ఇండ్ల పై కప్పులు ఊడిపోయి ఇండ్లు కూలిపోయిన బాధితులకు, మామిడి, కూరగాయల రైతులకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. రైతాంగానికి జరిగిన లోటును పూడ్చేందుకు వచ్చే ఖరీఫ్ పెట్టుబడికి విత్తనాలు, ఎరువులకు 50 శాతం సబ్సిడీ ఇచ్చి పంపిణీ చేయాలన్నారు. రైతుబంధు డబ్బులను జూన్ మొదటి వారంలో రైతుల ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రైతుల పట్ల ఏ ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతాంగానికి భరోసా కల్పించి అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతంగానికి నష్టపరిహారం వచ్చేంతవరకు జేఏసీ, అఖిలపక్షం పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ ఆగంం రెడ్డి, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, మాజీ జడ్పీటీసీలు దాసరి కళావతి, కొమ్ము నర్సింగ రావు, కాంగ్రెస్ కౌన్సిలర్ చెవిటి లింగం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ యాదయ్య, మంచాల చిరంజీవులు, కొంగరి వెంకట్ మావో, ఈరి భూమయ్య, సయ్యద్ ఎక్బాల్,కడవేరుగు మాజీ సర్పంచ్ ఎండీ. లాల్, ఉడుగుల శ్రీనివాస్, గూడ రాజీ రెడ్డి, ఆముదాల రంజిత్ రెడ్డి,నర్సిరెడ్డి, బండి సుదర్శన్, ఇప్పకాయల శోభ, మల్లం విజయ, అల్లం శ్రీనివాస్, బండకింది అరుణ్ కుమార్, కాటం మల్లేశం, ఇప్పకాయల శోభ, దాసరి శ్రీకాంత్, పిల్లి రవి, చింతల చక్రపాణి, సూర్న శ్రీకాంత్, చింతల నరేష్, తుమ్మ శ్రీనివాస్, ముస్త్యాల శంకరయ్య, చింతల నర్సింహులు కోరే శ్రీశైలం, చింతల నాగమ్మ,చింతల అంజయ్య, ఎర్రబోసు అశోక్, గుస్క కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులైనా గ్రామానికిరాని మిషన్ భగీరథ నీళ్లు

- ఎండాకాలం కావడంతో నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్న గ్రామస్తులు
- స్పందించని మిషన్ భగీరథ అధికారులు



నవతెలంగాణ-తొగుట

నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని వడ్డెర కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం మండలంలోని పెద్దమాసాన్‌పల్లి మధిర గ్రామం వడ్డెర కాలనీ వాసులు గ్రామానికి సమీపంలో మిషన్ భగీరథ నీళ్ల పైపు ధ్వంసమై నీళ్లు రావడం లేదని తెలిపారు. వడ్డెర కాలనీకి వెళ్లే పైప్‌లైన్ కట్ అయ్యి నెల రోజులు అవుతుందని, మిషన్ భగీరథ అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ శాఖ అధికారి తొగుట, వెంకట్రావుపేట గ్రామాలలో బినామిల పేరుతో వాటర్ ట్యాంకులు నిర్మాణం చేస్తున్నారని అన్నారు. అధికారులు బినామీ పేర్లమీద కాంట్రాక్టు చేస్తే ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులుగా తాము ఉండి ఏమి లాభమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల కోసం ఫోన్ చేస్తే అధికారులు స్పందించకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. నీళ్ల రాక ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు నీటి సమస్య తీర్చకుండా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కంటి సమస్యల పరిష్కారానికి కంటి వెలుగు



నవతెలంగాణ రాయపోల్

రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రజలందరూ చక్కనైన కంటిచూపుతో కంటి సమస్యల నిర్మూలనకే కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ప్రారంభించడం జరిగిందని అనాజీపూర్ సర్పంచ్ శోభారాణి, ఎంపీడీవో మున్నయ్య అన్నారు. గురువారం రాయపోల్ మండలం అనాజిపూర్ గ్రామంలో రెండో విడత పల్లె వెలుగు కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన కంటి చూపు ఉండాలనే ఉద్దేశంతో ఉచితంగా గ్రామాలలో శిబిరాలు నిర్వహించి కంటి వెలుగు కార్యక్రమంలో కళ్లద్దాలు మందులు అందించడం జరుగుతుందని, సమస్య ఎక్కువ ఉన్నవారిని జిల్లా ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. దేశంలోనే ఆరోగ్య సూచీలో తెలంగాణ రాష్ట్ర మూడోస్థానంలో ఉందని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన వైద్య సౌకర్యాలను ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పల్లె వెలుగు కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాలలో చేపట్టడం జరుగుతుందని, 18 సంవత్సరాలు పైబడి వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యుల బృందం శ్రీనివాస్, పరమేష్, రాజు, ఏఎన్ఎంలు అరుణ, మంజుల, పంచాయతీ కార్యదర్శి శ్రీమన్, బిఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, రామ చంద్రం గౌడ్, భార్గవ్, శ్రీధర్, ఆశా కార్యకర్తలు బాలమణి, సునీత, మార్త, అంగన్వాడి టీచర్లు సరస్వతి, మంజుల, భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



నవతెలంగాణ-మిరుదొడ్డి

ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీసీసీ జిల్లా ప్రతినిధి ప్రవీణ్ అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం అందే గ్రామంలో రైతులతో కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ సెంటర్కు వెళ్లి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సిద్దిపేట జిల్లాలో నిన్న రాత్రి కురిసిన వడగండ్ల వాన వల్ల అకాల వర్షాల వల్ల ఎకరాలలో వరి పంట నష్టం జరిగిందని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతుల కన్నులలో కన్నీరు మిగిల్చిందనీ అన్నారు. మరో వారం రోజుల్లో వరి చేను కోసుకునే సమయంలో రాళ్లపడి అపారమైన నష్టం జరిగినటువంటి రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల నష్టపరిహారాన్ని చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ సెంటర్లలో వడ్లు కొనుగోలు సెంటర్లలో ప్రతి రైతుకు ఉచితంగా టార్పలిన్ కవర్లను అందించి, వరి ధాన్యాన్ని తడవకుండా తార్పోలిన్ కవర్లను అందించాలనీ తెలిపారు. రైతులకు సబ్సిడీ ల ద్వారా టార్పొలిన్ కవర్లను అందించాలని తెలిపారు. ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసి రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు యాదగిరి, స్వామి, రాజారామ్, రాములు,రాజిరెడ్డి, మధుసూదరెడ్డి,రాజారామ్, స్వామి పాల్గొన్నారు.

ఫుట్బాల్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి కాల శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఫుట్బాల్ శిక్షణ శిబిరం ప్రారంభమైందని గజ్వేల్ పట్టణవాసులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫుట్బాల్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రాము గారి గణేష్ అన్నారు. గురువారం గజ్వేల్ లో ఫుట్బాల్ శిబిరాన్ని ప్రారంభించారు. .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ మే1వ తేదీ నుండి ప్రారంభమై మే 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఫుట్బాల్ శిక్షణ కార్యక్రమం తూప్రాన్ రోడ్ లో గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియం ఫుట్బాల్ గ్రౌండ్ లో మే1 నుండి 30 వరకు ఉదయం 5:30 నుండి 8:30 వరకు శిక్షణ శిబిరం ఉంటుందన్నారు.శిక్షణ శిబిరానికి కోచ్ గా క్లబ్ నుండి ఎర్రవాడ నగేష్ ని నియమించడం జరిగిందన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని గజ్వేల్ పట్టణ ప్రజలు వినియోగించుకోవలని పూర్తి వివరాలకు గజ్వేల్ ఫుట్బాల్ ప్రతినిధులు ఎన్.చక్రపాణి గౌడ్(9502194194), ఎన్.సుగుణాకర్ రెడ్డి(9246939707), రామ్గారి నర్సింలు(8121392441), జి.శ్రీకాంత్ లను(9121837573), కోచ్ మీ నాగేష్(9908789877) లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, కోచ్,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే బీఆర్ఎస్ జెండా గద్దె నిర్మాణం తగదు

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవతెలంగాణ - సిద్దిపేట

అధికారం ఉందని రోడ్డుపైనే బీఆర్ఎస్ జెండా గద్దె నిర్మించడం తగదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలో రోజురోజుకు వాహనాల రద్దీ పెరుగుతోందన్నారు. బీఆర్ఎస్ ప్లీనరీ సందర్భంగా రోడ్డుపైనే ఆ పార్టీకి చెందిన జెండా గద్దె నిర్మాణాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. త్వరలోనే అదే రోడ్డులో కాంగ్రెస్ జెండాను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఎంఐఎం, మిగతా పార్టీలు కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మంచి చేయాల్సిన ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

రైతులకు పంట నష్ట పరిహారం అందజేయాలి



నవతెలంగాణ - సిద్దిపేట

అకాల వర్షాలతో పంట నష్టం జరిగిన రైతులందరికీ వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ సూర్య వర్మ, పీసీసీ కిసాన్ కాంగ్రెస్ సమన్వయకర్త నాయిని నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ పక్షాన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పులు చేసి పెట్టుబడి పెడితే తీరా పంట చేతికొచ్చే సమయంలో వడగండ్ల వాన వచ్చి మా బతుకులను నాశనం చేసిందని రైతులు భోరున విలపిస్తున్నరని అన్నారు. రోడ్లపై, కల్లాలలో ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకపోయిందని, కోతకు సిద్ధంగా ఉన్న వరి కుంకుల నుంచి ధాన్యం నేల రాలిందని అన్నారు. ప్రభుత్వం పంట నష్ట అంచనాలు, సర్వేలతోనే సరిపెట్టకుండా తక్షణమే ఆర్థిక సహాయాన్ని రైతులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ వైస్ చైర్మన్ కలీముద్దీన్, డీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జంగోని శ్రీనివాస్ గౌడ్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సామల సంతోష్, రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు రమేష్, నాయకులు సందీప్, కుమార్, బాల్‌రాజ్, వినయ్, జావేద్ పాల్గొన్నారు.11



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-జోగిపేట

ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వార్డు పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు సూచించారు. గురువారం స్థానిక వార్డులోని ముదిరాజ్ సంగంలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలు ఉన్నవారు కేంద్రానికి వచ్చి చూపించుకొని అద్దాలు పొందాలన్నారు. వార్డులో కంటి సమస్యలున్న వారందరిని పరీక్షించి, వారికి తగిన పరిష్కారాలు చూపించిన తర్వాతనే కేంద్రాన్ని మరో వార్డుకు తరలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జోగిపేట వైద్య సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.



పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస సుభాష్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాల యంలో మీర్జాపూర్ గ్రామానికి చెందిన పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యే సతీష్ కుమార్ సహకారంతో పేద ప్రజలకు డబుల్ బెడ్ రూంల పట్టాలని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మీర్జాపూర్ సర్పంచ్ తరాల లత మహేందర్, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజని తిరుపతిరెడ్డి తాహసిల్దార్ ఉన్ని షా బేగం , లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండాలి..



ప్రతీ ఒక్కరికి సీపీఆర్ పై అవగాహన కలిగి ఉంటే గుండెపోటు వచ్చినప్పుడు ప్రాణాలు కాపాడవచ్చునని హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస అన్నారు. గురు వారం వైద్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మానస మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి సౌమ్య , ఎంపీడీవో కుమారస్వామి, సర్పంచులు వంగ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా.. కారు ఢీకొని మహిళ మృతి

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



రోడ్డు దాటుతున్న సమయంలో మహిళకు కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి గుండన్నపల్లి వద్ద గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపల్ పరిధిలోని నాలుగో వార్డు గుండన్నపల్లి గ్రామానికి చెందిన ఎక్కల దేవి రాజవ్వ(52) రోడ్డుపై కంకులు అమ్ము కుంటూ జీవనం కొనసాగిస్తుంది. రోజు మాదిరిగానే కంకులు అమ్ముతూ రోడ్డు దాటుతున్న సమయంలో హైదరాబాద్ నుండి ప్రజ్ఞాపూర్ వైపు వస్తున్న ఓ కారు ఆమెను బలంగా ఢీ కొట్టింది. దీంతో రాజవ్వ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. స్థానికులు గజ్వేల్ పోలీస్‌లకు సమాచారం అందించారు. వెంటనే గజ్వేల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం అక్కడే శవ పంచానామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా కుంటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు నిర్వహించారు.

శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లు పంపిణీ

నవతెలంగాణ-జహీరాబాద్



విద్యార్థుల్లో నైపుణ్యత పెంపొందించేందుకు వికాస్ సంస్థ ఎంతో కృషి చేస్తున్నదని ఆ సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం జహీరాబాద్‌లోని వేద ఐటిఐ కాలేజ్ లో వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆ నాలెడ్జి, సర్వీసెస్(వికాస్) సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ పొందిన 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి వికాస్ సంస్థ చైర్మెన్ కొత్తకాపు లక్షమా రెడ్డి అధ్యక్షత వహించగా, డా.సురేష్ కులకర్ణి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జహీరాబాద్ ప్రాంతంలో భవిష్యత్తులో రాబోతున్న అనేక పరిశ్ర మలను దృష్టిలో పెట్టుకుని దూరదృష్టితో ఇక్కడి యువకులకు ఇప్పటినుండే నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను చేపట్టిన వికాస్ సంస్థకు, ప్రత్యేకించి లక్ష్మారెడ్డికి డా.కులకర్ణి అభినందనలు తెలిపారు. జీవన్ రావు కార్యక్రమాన్ని నిర్వహించగా, టీచర్ విట్ఠల్ వందన సమర్పణ చేశారు. ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ కోశాధికారి పులి రాజారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ సంతోష కుమార్, కన్సల్టెంట్ సిద్ధిఖ్, కాలేజ్ ప్రిన్సిపాల్ ఇర్ఫాన్, కొత్తకాపు సురేందర్ రెడ్డి,గణపురం సంగారెడ్డి తదితర అతిథులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని వీవోఏల నిరసన





నవతెలంగాణ-జోగిపేట

11రోజున వీవోఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించబోయేది లేదని వారు స్పష్టం చేశారు.

జోగిపేలో వీవోఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి డీసీసీబీ ఉద్యోగులు మద్దతు తెల్పినారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర నాయకులు మల్లన్న, జిల్లా నాయకులు లక్ష్మా రెడ్డి, వీఓఏలు ఆంజనేయులు, విజయ, స్వప్న, సునీత, కవిత, అనిత, రేణుక, మానస, గోపాల్, అశోక్, చంద్రిక, లాయక్, వీరమని, వాసవి, పోచయ్య, భాగయ్య, బాలయ్య, ఫహీం ,హర్షియ, సుప్రియ, అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి : 11 రోజు వీవోఏలు చేపట్టిన నిరసనకు జన జాగృతి సేన అధ్యక్షుడు బంగారు కృష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీవోఏలను ప్రభుత్వం సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వారికి కనీస వేతనం రూ.26,000, సాధారణ బీమా రూ.10 లక్షలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్టిగాళ్ల మోహన్, తెలంగాణ సోషల్ ఫోరమ్‌రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, వీఓఏలు పాల్గొన్నారు.



గుమ్మడిదల : నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం వీవోఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. వీవోఏల మండల అధ్యక్షురాలు మాధవి, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కల్హేర్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కల్హేర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బీబీపేట గ్రామ సర్పంచ్ రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని బీబీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు క్యాంపు శిబిరా న్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్ష నిర్వహించే విధానాన్ని పరిశీలించి.. మొదట కంటి పరీక్షలు చేయిం చుకున్నారు. తర్వాత కంటి పరీక్షలు నిర్వహించిన వారికి కండ్ల అద్దాలను పంపించేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సంపూర్ణ అంధత్వ నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. అందులో భాగంగానే ఈ కంటి వెలుగు శిబిరాలను గ్రామ గ్రామాన ప్రారంభించిందన్నారు. ఈ శిబిరాల్లో ఉచితంగా కంటి పరీక్షలు చేయడమే కాకుండా.. అవసరమున్న వారికి ఉచితంగా కండ్లద్దాలను అందజేస్తారరన్నారు. కాబట్టి 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్, క్యాంపు మెడికల్ ఆఫీసర్ శ్రీరంగం నాథ్, పీహెచ్ఎన్ నిర్మల, ఆర్థమాట్రిస్ట్ సరిత, ఎంపీహెచ్ఏ తారా సింగ్, క్యాంపు డీఈఓ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి రాజు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని ఖలీల్‌పూర్‌లో ఆ గ్రామ సగర సంఘం ఆధ్వర్యంలో వారి కుల గురువు భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ఘనంగా జరిపారు. ముందుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించి.. ముఖ్య కూడలి వద్ద మహర్షి జయంతి సందర్భంగా జెండా ఏర్పాటుతో పాటు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగదాంబ, ఎంపీటీసీ జ్యోతి అశోక్ రెడ్డి, విట్టల్ రెడ్డి, సగర సంఘం అధ్యక్షులు విజయ్ కుమార్ సగర, అశోక్, తుక్కన, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



బసవ భవన్ నిర్మాన భూమిపూజ కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-ఝరాసంగం

కాశీపూర్ వద్ద నిర్మిస్తున్న భవసవ భవన్ పూజా కార్యక్రమాన్నీ విజయంతం చేయాలని జిల్లా వీర్షైవ లింగాయత్ సమాజ్ ప్రధాన కార్యదర్శి ఎన్ రవికుమార్, తాలూకా ప్రధాన కార్యదర్శి పి ప్రశాంత్ పాటిల్, జిల్లా వీర్షైవ లింగాయత్ సమాజ్ యువత సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 29న మంత్రి హరీశ్‌రావు చేతి మీద భూమి పూజ చేరినట్లు పేర్కొన్నారు. గురువారం ఝరాసంగం మండలంలోని కప్పాడ్ గ్రామంలో బసవ భవన్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమ చలో సంగారెడ్డి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాను పటేల్,రమేష్ పటేల్, నరేష్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్ : ఈనెల 29న జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించే బసవ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌న లో గురువారం నారాయణఖేడ్ బసవ మండపంలో ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజం సభలు నాగిశెట్టి, జగదీశ్వర్, శంకర్రావు పాటిల్, వెంకటేశం, రవీందర్ షెట్కర్, సంగిశెట్టి, విశ్వనాథ్, అడిగప్ప, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



అంగన్వాడీలో అన్యువల్ డే

నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని హరిదాస్పూర్ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రంలో గురువారం అన్యువల్ డే ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ యేసుమని మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అన్యువల్ డే ప్రోగ్రాం చేపడుతున్నామని.. ఇందులో భాగంగా పిల్లలకు డాన్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. వారికి అసిస్టెంట్ కార్డ్స్, మెడల్స్‌తో అభినందిస్తున్నామన్నారు. చైల్డ్ డెవల ప్మెంట్ ఆఫీసర్ పి పి.రేణుక, సూపర్వైజర్ శ్యామ ల,సర్పంచ్ షఫీ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మండలంలో భారీ వర్షం

నవతెలంగాన-కోహిర్

మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. వడగండ్ల వాన పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చేతికొచ్చిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని వారు వాపోతున్నారు. వర్షం ధాటికి చెట్లు విరిగి రోడ్లపై పడడంతో.. ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

డీఎస్‌పీ బహిరంగ సభ గోడపత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ–హుస్నాబాద్ రూరల్

దళిత శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపక అధ్యక్షులు విశారదన్ పాదయాత్ర ముగింపు కార్యక్రమం హైదరాబాదులోని సరూర్ నగర్ స్టేడియంలో ఏప్రిల్ 30న జరిగే భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని డీఎస్‌పి నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం హుస్నాబాద్ పట్టణంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు బోయిని సదన్ మహారాజ్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డ మీద బీసీ ఎస్సీ ఎస్టీలు స్వరాజ్య సాధన కొరకు ముందుండి పోరాడాలన్నారు. విద్యార్థులు, యువకులు, ప్రజాస్వామ్యవాదులు, అగ్రకుల పేదలు, భారత రాజ్యాంగ ప్రేమికులు అందరూ కూడా అధిక సంఖ్యలో బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చంచల ఎల్లయ్య, నాయకులు ప్రవీణ్ , సతీష్, వెంకటేశ్,రాహుల్, రాజశేఖర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాజారెడ్డి



నవతెలంగాణ–హుస్నాబాద్ రూరల్

రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి అన్నారు. గురువారం హుస్నాబాద్ మండలంలోని మిర్జాపూర్, పోతారం ఎస్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ రైతులకు వరి ధాన్యం అమ్మకంలో నష్టం లేకుండా లేకుండా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తరాల లత మహేందర్, వంగ విజయలక్ష్మి వెంకటరామిరెడ్డి, బత్తిని సాయిలు, ఎంపీపీ లకావత్ మానస సుభాష్, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ అంటేనే గజ్వేల్ యువకులకు పండగ

మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి



నవ తెలంగాణ–గజ్వేల్

మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి సౌజన్యంతో గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు భరత్, చారీ ఆధ్వర్యంలో నియోజకవర్గ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి విన్నెర్స్, రన్నెర్స్‌కు ట్రోఫీలతో పాటు గెలిచిన టీమ్‌కు రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు తర్వాత గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సహిస్తూ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి క్రీడల పట్ల ఆసక్తి చూపుతున్నారని క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటుకోవడానికి క్రీడా పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటుకోవాలన్నారు. అలాగే చదువులతో పాటు యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీర ప్రసాద్, సిద్దిపేట జిల్లా ఐవిఎఫ్ యువజన అధ్యక్షులు నేతి చిన్న సంతోష్., ఆరిఫ్, కొమురవెల్లి ప్రవీణ్ గాడిపల్లి బలరాం, తాహేర్, సీనియర్ క్రికెటర్ బాకీ స్వామి, ఖాజా, కరుణాకర్, ఓబేదూర్, కన్నా, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు రూ.30 వేలు అందజేయాలి

బీజేపీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ–సిద్దిపేటరూరల్

అకాల వర్షం కారణంగా నష్టపోయిన పంట రైతులకు రూ.30 వేలు ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలని బీజేపీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు వడగళ్ల వర్షం కారణంగా వరి, కూరగాయలు తోటలు నష్టపోయి పంటలను సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం ఎకరానికి రూ.30 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి రాష్ట్రం యొక్క వాటా చెల్లించి రైతులను ఆదుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు పోతురాజు రాజు, యువమోర్చా మండల అధ్యక్షులు సురేష్ గౌడ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు దుర్గం రాజు, బీజేవైఎం కమ్మ శ్రీను, సోషల్ మీడియా కన్వీనర్ సురేష్, కనకయ్య, దేవరాజు, నరేష్, సాగర్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌కు గురై పాడి గేదె మృతి



నవతెలంగాణ–నంగునూరు

కరెంట్ షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందినట్లు గ్రామ సర్పంచ్ ఐలేని సత్తవ్వ తెలిపారు. నంగునూరు మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఏరువా విఠల్ రెడ్డి పాడి గేదెను రోజు లాగానే పశువుల పాక బయట ప్రదేశంలో కట్టి వేసి ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో గాలి దుమారానికి విద్యుత్ స్తంభానికి ఉన్న కరెంట్ వైర్ తెగి పాడి గేదెపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. గురువారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్ళి చూడగా కరెంట్ వైర్ తెగి ఉండటంతో సంబంధిత అధికారికి తెలియజేశారు. పాడి గేదె చనిపోవటంతో డెబ్బై వేల వరకు నష్టపోయినట్లు భాదితుడు విఠల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఐలేని సతీష్ గౌడ్ కోరారు.

నేడు దౌల్తాబాద్‌లో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ–దౌల్తాబాద్

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో శుక్రవారం ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు ఏపీఎం ఆస కిషన్ తెలిపారు. రెండు మూడు రోజుల్లో మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వడ్ల కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


నేడు దుర్గ భవాని ప్రథమ వార్షికోత్సవం



నవతెలంగాణ–దౌల్తాబాద్

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని దుర్గా భవానీ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ శుక్రవారం నిర్వహిస్తుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మల లాలు బాబు అన్నారు. శుక్రవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమై పుణ్యావచనం, మండప ఆరాధన, శ్రీ సూక్తం దుర్గాసూక్తములతో అభిషేకం, దుర్గామాత కళ్యాణం, ఒడిబియ్యం, చివరగా అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. చుట్టుపక్కల ఉన్న గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



నవ తెలంగాణ- దౌల్తాబాద్

మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంలో ఇటీవల చామంతి పోచవ్వ మృతి చెందిన విషయం తెలుసుకొని గురువారం ఉప సర్పంచ్ బొల్లం స్వామి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు ఆదేశానుసారం బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నరేష్, ప్రశాంత్, మల్లయ్య, సైదయ్య, స్వామి, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంక్షల్లేకుండా ధాన్యం కొనుగోల్లు చేపట్టాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట రెడ్డి డిమాండ్

నవతెలంగాణ–బెజ్జంకి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాలన సాగించిన ప్రభుత్వాలు రైతులు పండించిన వరిధాన్యాన్ని ఎలాంటి అంక్షల్లేకుండా కొనుగోలు చేసిందని.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఆంక్షలను ఎదుర్కొంటూ ఆందోళన చెందుతున్నారని.. వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం బేషరుతుగా ఎలాంటి అంక్షల్లేకుండా కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. ధాన్యం తూకం నుంచి మిల్లులకు ధాన్యం చేరే వరకు రైతులు అడుగడునా అన్యాయానికి గురవుతున్నారని, రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా వెంటనే వరిధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను అధికారులు వేగవంతం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

నేటి నుంచి సమ్మె చేస్తాం, సహకరించండి



నవతెలంగాణ–మర్కుక్

జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 13వ తేదిన సమ్మె నోటీసు ఇస్తూ 15 రోజుల నోటీసు పీరియడ్ అనంతరం ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోతే ఈ నెల 28వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు చేపడుతామని పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో అమలు చేస్తూ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో తమ వంతు బాధ్యతగా భాగస్వాములమయ్యామన్నారు. ప్రతి కార్యదర్శి ఎంతో క్రియాశీలకంగా పనిచేసి, గ్రామాలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు రావడంలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన 4 సంవత్సరాల గడువు పూర్తి అయినప్పటికి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ సంబంధించిన ఎటువంటి ఉత్తర్వులు వెలువరించలేదన్నారు .జూనియర్ పంచాయతీ కార్య దర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ 6.0. విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల మండలాధ్యక్షులు శైలేష్, ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర్, నీలిమా, వాణి, రాజశేఖర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, రేఖా, సంగీత, శ్వేత, జ్యోతి, శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులున్నారు..

నవతెలంగాణ–తొగుట

గ్రామాల అభివృద్ధికి గ్రామీణ ప్రజల జీవన విధానం మెరుగు పడే విధంగా ఎంతో కృషి చేశామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వైస్ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లా డుతూ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తమ సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ శాంతి యుతంగా సమ్మె చేస్తామని, మాకు మద్దతు తెలుపాలను వైస్ ఎంపీపీ బాసి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి కి సమ్మె పత్రాన్ని అందించామన్నారు. 2018 సంవత్సరంలో 3 సంవత్సరాల ఒప్పందం ప్రకారం తమకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. పని విధానాన్ని బట్టి రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ మరో సంవత్సరం పొడగించి మోసం చేశారన్నారు. నేడు ఉలుకు పలుకు లేకుండా వ్యవహరించడం సరి కాదన్నారు. ప్రతి రోజు గ్రామాల అభివృద్ధికి, గ్రామ ప్రజల సమ స్యల కోసం ఎంతో కృషి చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి పనులు చేయడంతో గ్రామాలకు, సర్పంచ్‌లకు పథకాలు సాధించడానికి ఎంతో కృషి చేశామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వైస్ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి ఈ విషయాన్ని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్తామని హామీ ఇచ్చారు. మీకు న్యాయం చేకూరేలా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు స్వామి, వేలాద్రి, శ్రీనివాస్,స్నేహప్రియ, అశ్విని, మహేశ్వరి, బాలమని తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ–చేర్యాల

చేర్యాల మండలంలోని వివిధ గ్రామాలలో జూనియర్, ఔట్సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న వారు తమ ఉద్యోగాలను నోటిఫికేషన్లో పేర్కొన్నట్లుగా ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయడంలో విఫలం కావడంతో శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు జేపిఎస్‌లు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డితోపాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్ లకు సమ్మె చేస్తున్నట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేపిఎస్‌ల మండల అధ్యక్ష, కార్యదర్సులు ఏలూరి రాజు, మలుగ సతీష్ మాట్లాడుతూ తమను క్రమబద్ధీకరించి సర్వీస్ బుక్కులు అందించే వరకు సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సురేష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రాజు, సందీప్, తిరుపతి, బాలయ్యతోపాటు మండలంలోని జేపిఎస్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి







నవతెలంగాణ–మద్దూరు

ధాన్యం కొనుగోలు కేంద్రం రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని లద్నూర్ మర్మముల ధర్మారం సలాక్ పూర్ గ్రామాలలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డిలతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించుకోవాలని ఆయన కోరారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట గత నాలుగు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వర్షానికి నేల రాలిపోవడం చాలా బాధాకరమన్నారు. వడగండ్ల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించి ఆదుకుంటుందని ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, సర్పంచులు జీడికంటి సుదర్శన్, ఊట్ల రవీందర్ రెడ్డి, సుందరగిరి స్రవంతి పరశురాములు గౌడ్, సీఈవో బోయిని శ్రీధర్, ఉప సర్పంచులు బెడద కుమారస్వామి, శ్రీధర్, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ కాసర్ల కనకరాజు, పిఎసిఎస్ డైరెక్టర్ ఉట్కూరి మల్లేశం, బీఆర్ఎస్ మండల నాయకులు పుట్ట వెంకటరమణారెడ్డి, వార్డు సభ్యులు మంద సుమన్, యూత్ మండలాధ్యక్షుడు గూడా రవీందర్ రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జ్ పాకాల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ–నంగునూరు : వడ్ల కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ తడిసిన ఉమ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి సూచించారు. గురువారం నంగునూరు మండలంలోని సొసైటి–7, ఐకేపీ–5 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 12వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అక్కెనపల్లి, గట్లమల్యాల, కొండంరాజ్ పల్లి, ఖాత, ఘణపూర్, నంగునూరు, సిద్దన్నపేట, దర్గపల్లి,బద్దిపడగ, జేపీ తండా, పాలమాకుల, ముండ్రాయి గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ ఫామ్ సొసైటీ రైతు ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, సొసైటీ చైర్మన్లు ఎల్లంకి మహిపాల్ రెడ్డి, కోల రమేష్ గౌడ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దిపడగ కిష్టారెడ్డి ,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్ లతో కలిసి మాట్లాడారు.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు పడకుండా కావలసిన వసతులు, సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్ల కంటి రేణుక వేణుగోపాల చారి, సర్పంచులు శ్రీమంతుల వెంకటేశం, తిప్పని రమేష్, నారోజు విజయలక్ష్మి బ్రహ్మాచారి, చల్ల దశమంత రెడ్డి, బిక్షపతి నాయక్, పంగ కుమార్, ఎంపీటీసీలు బెదురు తిరుపతి, ఏట గీత గౌడ్, ఐకేపీ ఏపీఎం అంజనేయులు, ఏఈఓలు,మాజీ ప్రజా ప్రతినిధులు, మార్కెట్, సొసైటి డైరెక్టర్లు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, రైతు బంధు సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ–బెజ్జంకి : మండల పరిధిలోని గుండారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సర్పంచ్ శెట్టి లావణ్య, ఎంపీటీసీ ఎలుక లత కలిసి ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ రాజయ్య, ఉప సర్పంచ్ రాము, ఏపీఎం నర్సయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలను పరిశీలించిన రైతు సంఘం నాయకులు



నవతెలంగాణ–జగదేవపూర్

వడగండ్ల వానలకు పంట నష్టం జరిగిన రైతులకు వెంటనే ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతు రక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి రాజు కోరారు. గురువారం జగదేవపూర్ మండలంలోని తిమ్మాపూర్, అనంతసాగర్, రాయవరం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి బీభత్సం వల్ల పంటలకు నష్టం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టం జరిగిన రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు. ఎకరానికి పెట్టుబడి నలభై వేల వరకు పెట్టారని, వడగండ్ల వర్షానికి పెట్టిన పెట్టుబడి కూడా పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పంట నష్టాన్ని బట్టి నష్ట పరిహారం ఎకరానికి ఇరవై వేల వరకు ఇచ్చి రైతులకు మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రైతులు నష్టపోయిన వివరాలను వ్యవసాయ అధికారులకు చెప్పాలన్నారు. వడగండ్ల వర్షానికి వరి, మొక్క జొన్న, కూరగాయలు, మామిడి తోటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఆకాల వర్షాల పట్ల రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర పెంచాలని కోరారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతులు మనోధైర్యం కోల్పోవద్దని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు మానవతా దృక్పథంతో రైతులకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు నర్సిములు గౌడ్, ఈశ్వర్, మట్టి మనిషి ఫౌండేషన్ చైర్మన్ పరశురామ్, రైతులు మహేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి









నవతెలంగాణ–అక్కన్నపేట

అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం జెడ్పీటీసీ భూక్యమంగా, సర్పంచ్ బొమ్మగాని రాజేశం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కంటి వెలుగు ద్వారా కంటి సమస్యలు ఉన్నవారు తప్పనిసరిగా చూయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బిల్ నాయక్, అక్కన్నపేట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పెసర సాంబరాజు, సెక్రెటరీ సుమలత, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

నవతెలంగాణ–దౌల్తాబాద్

రాష్ట్ర ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అయ్యగారి నర్సింలు పేర్కొన్నారు. మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింలు మాట్లాడుతూ ప్రైవేట్ దావాఖానాలలో కంటి చికిత్సకు వందల రూపాయలు వసూలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేసి ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నిరుపేద కుటుంబాలకు కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఆధునాతనమైన ఏఆర్ మిషన్ల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను, మందులను ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నవతెలంగాణ–తొగుట

గ్రామ ప్రజలందరు కంటి పరీక్షలు చేసుకోవాలని సర్పంచ్ చిక్కుడు చంద్రం అన్నారు. గురువారం మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు బోధనం కనకయ్యలతో కలిసి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 18 సంవత్స రాలు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగాల లలిత స్వామి, వార్డ్ సభ్యులు చెరుకు రేణుక, మంతూరి లక్ష్మి, బోయిని బాలరాజు, పంచాయతీ కార్యదర్శి నరసింగరావు,హెల్త్ సూపర్వైజర్ శ్యామల, డాక్టర్ ప్రశాంత్, అప్తో మెట్రిస్టు లావణ్య, డాటా ఎంట్రీ ఆపరేటర్ పర్జాణ, ఏఎన్ఎం సంతోష, ఆశా కార్యకర్తలు స్వరూప, ప్రావీన, కనకవ్వ, కారోబార్ యాదగిరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అసౌకర్యాల మధ్య నడుస్తున్న ఉపాధి పనులు

బీడీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ–జగదేవపూర్

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించకుండా, వేతనాలు సకాలంలో చెల్లించాలని బీడీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ శ్రీనివాస్ శర్మకు వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం మండలంలోని నిర్మల్ నగర్ ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనులు చేస్తున్నారన్నారు. కాని కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనుల్లో ఎన్ఎంఎంఎస్ నూతన సాంకేతకత యాప్ ప్రవేశ పెట్టడంతో ఉపాధి కూలీలకు కష్టాలు తప్పడం లేదన్నారు. వాస్తవంగా పనులు చేసిన గ్రామం నుంచి వేతనదారుల పనులకు సంబంధించి కూలీల హాజరు, ఫోటో ఫీల్డ్ అసిస్టెంట్లు యాప్ ద్వారా పంపించాలన్నారు. ఈ యాప్ ద్వారా ఎన్నో గ్రామాల్లో పనులు చేయలేక కూలీలు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనులు చేసినప్పటికీ బ్యాంకు ఖాతాలో కూలి జమ కాలేదని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. 2019 ముందు వేతనదారులకు తాగునీటి అలవెన్స్, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అప్పటి ప్రభుత్వాలు అందించేవని, గత ఏడాది నుంచి ఎంఎంఎస్ యాప్ కొత్త విధానం రావడంతో ఉపాధి కూలీలకు పనులు వద్ద ఎటువంటి సౌకర్యాలు లేవని కూలీలు వాపోతున్నారన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు మండల, డివిజన్, జిల్లా కేంద్రాలకు స్పందనలో ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ఈ యాప్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ పనుల వద్ద సౌకర్యాలు లేక కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు కారణంగా ఎండలతో పాటు ఉక్కబోత ఎక్కువగా ఉన్నప్పటికీ పనులు వద్ద తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు లేని పరిస్థితి నెలకొందన్నారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇవ్వాలి



నవ తెలంగాణ–గజ్వేల్

తక్షణ సహాయం కింద నష్టపోయిన ప్రతి రైతుకు రూ.25 వేలు చెల్లించాలని బీజేపీ అధికార ప్రతినిధి కన్వీనర్ నందా గౌడ్ అన్నారు. గురువారం రాష్ట్ర పార్టీ ఆదేశం ప్రకారం జిల్లా పార్టీ సూచన మేరకు భారతీయ జనతా పార్టీ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందించారు. వడగండ్ల వానకు, వరి, మక్కజోన్న నష్టపోయిన పంటలను సర్వే నిర్వహించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కింద కనీసం ఎకరానికి రూ.25 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి రాష్ట్రం వాటా చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కుడిక్యల రాములు అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబ కో కన్వీనర్లు సురేష్. మహేష్ మండల పట్టణ కార్యదర్శులు వాంజరి రాజు, పెండ్యల శ్రీనివాస్, పంజాల వెంకటేష్ గౌడ్, మండల పట్టణ ఉపాధ్యక్షులు నవీన్ విజయ్, మనోహరబాద్ మండల అధ్యక్షులు నరేందర్ చారి, కిసాన్ మోర్చ టౌన్ అధ్యక్షుడు మార్కంటి ఏగొండ బీజేపీ సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ ఆనంద్, సాయి గౌడ్, యువ మోర్చా మండల ప్రధానకార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మా ఎదుగుదలను ఓర్వలేకనే కుట్రలు

సోని రెస్టారెంట్ యజమాని అక్బర్



నవతెలంగాణ–సిద్దిపేట

పొరపాటున మా హెూటల్లో పనిచేసే బాయ్ హెూటల్‌కు వచ్చే కస్టమర్ల కోసం నీటి బకెట్‌ను కాకుండా ఇతర బియ్యం బకెట్ తీసుకురావడం జరిగిందని, కేవలం మా ఎదుగుదలను చూసి ఓర్వలేక, హెూటల్ వ్యాపారంలో "సోని" బ్రాండ్‌ను దెబ్బ తీయడానికి కావాలనే కొందరు కుట్రలు చేశారని సోని రెస్టారెంట్ల యజమాని అక్బర్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 21న హెూటల్లో పనిచేస్తున్న బోరు చెడిపోవడంతో వచ్చే కస్టమర్ల కోసం బకెట్ల ద్వారా నీటిని అందించడం జరిగిందన్నారు. మంచినీటి ట్యాంకర్‌ను తెప్పించి రెస్టారెంట్ వెనుక భాగంలో గల బాల్కనీలో అన్ని డ్రమ్ములు, బకెట్లు నింపి పెట్టినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలతో కలసి ఉన్న తాము, తమ పేరును చెడగొట్టుకోవడానికి అలా చేస్తామా అని అన్నారు. సోషల్ మీడియాలో వైరల్ చేయడం వెనుక కొందరు వ్యక్తులు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. జరిగిన విషయాలను విలేకరులకు సీసీ కెమెరాల రికార్డులను చూపించారు. ఈ కార్యక్రమంలో సోనీ రెస్టారెంట్ సిబ్బంది మక్బూల్ , ప్రదీప్, మహేష్ పాల్గొన్నారు.

అవయవ దానం చేసేందుకు ముందుకు



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

తమ మరణానంతరం కాకతీయ మెడికల్ కళాశాలకు 14 మంది అవయవ, శరీర దానం చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం సిద్దిపేట జిల్లా శాఖ బూట్ల రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాజేందర్ తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవయవ శరీర దానానికి అంగీకార పత్రాలను కాకతీయ మెడికల్ కళాశాలకు అందించారు. హుస్నాబాద్ కు చెందిన పెందోట సుధాకర చారి, పెందోట మహేశ్వర చారి ,కాశ బోయిన బాలయ్య, కాశ బోయిన సంపత్ ,కొలిపాక తిరుపతి, కాశ బోయిన పోచయ్య, కోట అశోక్ ,ఉప్పుల హరీష్, కాటోజు రాజేష్ ఉప్పుల గణేష్ ,మడిపడగ విక్రం , బోడ గణేష్ పెట్టుబడి సంపత్ కుమార్ కాశ వేణి రమేష్ సుంకరి శ్రీకాంత్ కుంచం వినయ్ అన్నారు.

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అధికారుల తనిఖీలు



నవ తెలంగాణ కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఆ శాఖ అదనపు కమిషనర్ కేజ్యోతి ప్రధాన కార్యాలయ పర్యవేక్షకులు బాబు శంకర్‌తో కలిసి గురువారం పలు విభాగాలలో తనిఖీలు చేపట్టారు. ఆలయ ఆదాయ వ్యయాలు, భక్తులకు కల్పించే సౌకర్యాలు, ప్రసాదాల విక్రయాలు ఆర్జిత సేవా టికెట్ల అమ్మకాలు, ఐటీ, డోనర్ మొబిలైజేషన్, రికార్డులు నమోదు చేసి ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీ, ఏ ఈ ఓ వైరాగ్యం అంజయ్య, పాలక మండలి చైర్మన్ బిక్షపతి, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, తదితరులు ఉన్నారు

రైతులను ఆదుకుంటాం

ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్



నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

అకాల వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకుంటామని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ అన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్, వెంకటాపూర్, బుస్సాపూర్, వివిధ గ్రామాలలో పంట పొలాలను పరిశీలించి రైతులకు రూ.పదివేల ఆర్థిక సాయం అందజేశారు. వడగళ్ల వర్షం కారణంగా పంటలు పూర్తిగా నష్టపోయాయని ఎవరు బాధపడద్దని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. రమేష్, మనీ, నవీన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డ మహనీయుడు అంబేద్కర్

కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు

నవ తెలంగాణ కొమురవెల్లి



బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనునిత్యం పరితపించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కొమరవెల్లి మండలంలోని రాంసాగర్‌లో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ తాడూరి రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఈ దేశానికి రాజ్యాంగాన్ని అందించి పరిపాలన మార్గదర్శకుడయ్యాడని కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కొందరివాడు కాదని ఆయన అందరివాడని అన్నారు. ఈ దేశంలో అత్యధిక విగ్రహాలు అంబేద్కర్ కే ఉన్నాయని విగ్రహా ఆవిష్కరణలతో సరి పెట్టకుండా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన విషయాన్ని విస్మరించకూడదని వివరించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగంపై చేసే దాడిని ప్రజలు గమనించి ఎదిరించాలని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి మతోన్మాద మనువాద సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాలని చూస్తుందని ఈ చర్యను భారత పౌరులుగా ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఒక్క భారతదేశంలోనే కుల వ్యవస్థ కొనసాగుతుందని ప్రపంచ దేశాల్లో ఎక్కడ కుల వివక్ష లేదన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మాజీ ఎంపీపీ డాక్టర్ రామగుండం పరమేశ్వర్, మాజీ జెడ్పిటిసిలు దాసరి కళావతి, కొమ్ము నర్సింగరావు, ఎంపీటీసీ లింగంపల్లి కవితా కనకరాజు, అయినా పూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సనాది భాస్కర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాల కిషన్, నవీన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, పలు యువజన సంఘాల సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బీజేపీ ఎంపీ బ్రీజ్ భూషణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లబండి శశిధర్, సీఐటీయూ జిల్లా జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. గురువారం కొత్త బస్టాండ్ వద్ద సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం,రైతు సంఘం, ఐద్వా, డీవై ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ బ్రీజేష్ భూషణ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా గోపాలస్వామి మాట్లాడుతూ అంతర్జాతీయంగా అనేక పథకాలు సాధించి దేశానికి గౌరవాన్ని, ప్రతిష్టను తెచ్చిపెడుతున్న అగ్రశ్రేణి క్రీడాకారులైన రెజ్లర్లు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయడం అత్యంత దురదృష్టకరం. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు బేటీ బచావో బేటీ పడావో అంటూ ప్రవచనాలు పలుకుతున్నదని, మరోవైపు ఈ దారుణమైన నేరంలో ఆరోపణలెదుర్కొంటున్న రిజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్‌గా ఉన్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను రక్షించేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. మహిళా రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కూడా ఈ ఆరోపణలు చాలా తీవ్రమైనవిగా పేర్కొంటూ ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసిందని గుర్తు చేశారు. రెజ్లర్లు ఈ విషయమై ఆందోళన చేసిన సందర్భంగా ప్రభుత్వం కొన్ని హామీలిచ్చినప్పటికీ అమలు దిశగా చర్యలు లేకపోవడంతో వారు ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మళ్లీ ఆందోళనలకు దిగాల్సి వచ్చిందన్నారు. బ్రిజ్ భూషణ్‌పై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిరాళ్ల బండి శశిధర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి చంద్రారెడ్డి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సనాది భాస్కర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డబోయిన అరవింద్, దాసరి ప్రశాంత్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కర్రోల నవీన్, ప్రజా సంఘాల నాయకులు జాలిగాపు శిరీష, సంతోష్, సత్యనారాయణ, శ్రీనివాస్, బుచ్చయ్య, నరసింహులు, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ రైతులకు సాయం.. తెలంగాణ రైతులకు మొండి చెయ్యి

పంట నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తున్న సీఎం కేసీఆర్
జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



తెలంగాణ రాష్ట్ర సంపాదనను పంజాబ్ రైతులకు పంచిన సీఎం కేసీఆర్ తెలంగాణలో వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి ఆరోపించారు. దూల్మిట్ట మండలంలోని దూల్మిట్ట జాలపల్లి లింగాపూర్ చేర్యాల మండలం అర్జునుపట్ల కమలాయపల్లి గ్రామాలలో వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట వడగండ్ల వర్షంతో నేలపాలు కావడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రైతులకు ఆర్థిక సాయం చేయకుండా కాలయాపన చేస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సంపదను పంజాబ్ రాష్ట్ర రైతులకు దోచిపెట్టిన కేసీఆర్ తెలంగాణ రైతులు వడగండ్ల వర్షంతో పంట నష్టపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నా ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. దేశ రాజకీయాల మీద ఉన్న చిత్తశుద్ధి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతుల మీద లేదన్నారు. పంట నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్ కాంగ్రెస్ నాయకులు కొలుపుల యాదగిరి సాగర్ గౌడ్ బిక్షపతి మల్లయ్య రాములు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ చిగురిస్తున్న ముప్పు..

తొలగించిన కోనోకార్పస్ మళ్లీ చిగురిస్తున్న వైనం
పూర్తి స్థాయిలో తొలగించాలని స్థానికుల విజ్ఞప్తి

నవతెలంగాణ-బెజ్జంకి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కోనోకార్పస్ మొక్కలను విరివిగా నాటారు. నాటిన మొక్కలు మానవాళి ఆరోగ్యానికి ముప్పుగా వాటిల్లాయని గ్రహించిన ప్రజాప్రతినిధులు 2023 డిసెంబర్ మాసంలో మండల కేంద్రంతో పాటు బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలోని రోడ్డుపై నాటిన చెట్లను పూర్తి స్థాయిలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదేశాల ప్రకారం తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మొక్కలను పూర్తి స్థాయిలో తొలగించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల మళ్లీ కోనోకార్పస్ మొక్కలు చిగురిస్తున్నాయని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారి మళ్లీ చిగురిస్తున్న కోనోకార్పస్ మొక్కలను మండలంలోని ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి స్థాయిలో తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.